తెలుగుకలం

TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

అనంతపురం | కర్నూలు | కడప | చిత్తూరు | ప్రకాశం | గుంటూరు | విజయవాడ | హైదరాబాద్

సంపుటి : 01 సంచిక : 101 ఎడిటర్. అచుకట్ల ఖాదర్ బాషా పేజిలు : 08 గురువారం 12 - 11 - 2026వెల రూ. 2 రూ/

వచ్చే విద్యా సంవత్సరం నుంచి
తెలంగాణలో 10+2 విధానం!

- విద్యాశాఖ ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు
- తెలంగాణలో వచ్చే విద్యా సంవత్సరం నుంచే అమలు
- నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యకు ప్రాధాన్యం
- 12వ తరగతి నుంచే నైపుణ్య శిక్షణ
- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా మౌలిక వసతులు



హైదరాబాద్ :

రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచే టెన్ ప్లస్ టూ (10+2) విధానం అమలు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. బోధి పెవెలియన్‌లో విద్యాశాఖ ఉన్నతాధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష చేశారు. తొమ్మిది నుంచి 12వ తరగతి వరకు ఉన్నత విద్యగా పరిగణించి ప్రత్యేక విద్యను అందించాలని స్పష్టం చేశారు. పన్నెండో తరగతి నుంచి నైపుణ్యంపై దృష్టి పెడుతున్నట్లు సీఎం వెల్లడించారు. ఆధునిక అవసరాలకు అనుగుణంగా తెలంగాణ విద్యా విధానంలో సంస్కరణలు తీసుకురావాల్సిందేనని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ మొదటి ప్రాధాన్యమని సీఎం రేవంత్?రెడ్డి తెలిపారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ప్రాధాన్యమివ్వాలని తెలిపారు. ప్రైవేటుకు ధీటుగా సర్కారు పాఠశాలలను తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. ఒక్క విద్యార్థికి కూడా నష్టం జరగకుండా ఉండాలన్నదే ప్రభుత్వ ఆలోచనగా పేర్కొన్నారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, సుదర్శన్‌రెడ్డి, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ సంజయ్ జాజు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. - మిగతా 2 లో



అగ్ర దేశాలతో పోటీపడేలా
విద్యా సంస్కరణలు

- ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- కాజీపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన భట్టి విక్రమార్క
- సుమారు రూ.11 కోట్ల వ్యయంతో అందుబాటులోకి రానున్న నూతన పాఠశాల భవనం

హైదరాబాద్ :

తెలంగాణ బిడ్డలు ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదిగేలా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హనుమకొండ జిల్లా కాజీపేటలోని - మిగతా 2 లో

ఆంధ్రాకు నీళ్లు
తెలంగాణకు ఎక్కిళ్లు ఎందుకు



- నిర్మల్ రైతు గర్జన సభలో కేటీఆర్
- కృష్ణా, గోదావరి నీటిని ఏపీ ఎత్తిపోస్తుంటే తెలంగాణ ప్రభుత్వం చూస్తూ ఉందని నిర్మల్ రైతు గర్జన సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు

హైదరాబాద్ :

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రైతు సంక్షేమం కన్నా రాజకీయమే ముఖ్యమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. నిర్మల్‌లో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన రైతు గర్జన మహాసభలో కేటీఆర్ ప్రసంగించారు. ఇది ప్రకృతి తెచ్చిన కరవు కాదని పాలకులు తెచ్చిన కరవని ఆరోపించారు. పట్టిసీమ దగ్గర ఏపీ నీళ్లు ఎత్తిపోస్తుంటే, కన్నెపల్లి దగ్గర రేవంత్ ఎందుకు - మిగతా 2 లో

దేశంలోనే క్లీనెస్ట్ సిటీగా నవీ ముంబయి

- లిస్ట్‌లో విజయవాడ, విశాఖ
- దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా నవీ ముంబయికి మొదటి స్థానం లభించింది
- రెండో స్థానంలో సూరత్, మూడో స్థానంలో విజయవాడ నిలిచాయి



ముంబయి :

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే వార్షిక స్వచ్ఛతా సర్వేలో నవీ ముంబయి దేశంలోనే అత్యంత


రూ.3,230 కోట్లతో
'యుగే యుగీ భారత్' మ్యూజియం



- రూ. 3,230 కోట్ల ప్రాజెక్టుకు కేంద్ర కేబినెట్ ఆమోదం
- నార్త్, సౌత్ బ్లాక్ భవనాల్లో భారీ మ్యూజియం నిర్మాణం
- ప్రపంచంలోనే అతిపెద్ద ప్రదర్శనా స్థలంగా రికార్డు
- ఏడాదికి కోటి మంది సందర్శకుల రాక అంచనా

ఢిల్లీ :

భారతదేశ ఘనమైన చరిత్ర, నాగరికత, సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు సజీవంగా అందించే లక్ష్యంతో ప్రతిపాదించిన బృహత్తర ప్రాజెక్టు 'యుగే యుగీ భారత్ నేషనల్ మ్యూజియం' నిర్మాణానికి మార్గం సుగమమైంది. న్యూఢిల్లీలో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న ఈ ప్రాజెక్టుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ - మిగతా 2 లో



ప్రభుత్వ వాహనాలుగా ఎలక్ట్రిక్ కార్లే మొదటి పాధాన్యత

- కేంద్రం కీలక నిర్ణయం
- కేంద్ర శాఖల స్టాఫ్ కార్లుగా ఇకపై ఎలక్ట్రిక్ వాహనాలు
- ఈవీల కొనుగోలు పరిమితిని రూ. 20 లక్షలకు పెంచిన కేంద్రం
- పెట్రోల్ డీజిల్ కార్ల కొనుగోలు పరిమితి రూ. 10 లక్షలుగా ఖరారు
- అద్దెకు తీసుకునే కార్లలోనూ ఈవీలకే మొదటి ప్రాధాన్యం

ఢిల్లీ :

కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అన్ని మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో అధికారుల ఉపయోగం కోసం సమకూర్చే స్టాఫ్ కార్లలో ఇకపై ఎలక్ట్రిక్ వాహనాలకే (ఈవీ) తొలి - మిగతా 2 లో

3 నెలల పాటు
రాయితీపై నిత్యావసరాలు

- పేదలకు ఏపీ సర్కార్ ఊరట
- డిసెంబర్ నుంచి పండుగల నేపథ్యంలో పంపిణీకి నిర్ణయం
- రూ.100కే కిలో కందిపప్పు, రూ.125కే లీటర్ పామాయిల్
- పథకం కోసం రూ.300.60 కోట్ల రాయితీ భరించనున్న ప్రభుత్వం
- సరుకుల సేకరణకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు



అమరావతి :

నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్న పేదలకు ఉపశమనం కలిగించేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రానున్న క్రిస్మస్, సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని, డిసెంబర్ నెల నుంచి మూడు నెలల పాటు రేషన్ కార్డుదారులకు రాయితీ ధరలకే నిత్యావసర సరుకులను చౌక ధరల - మిగతా 2 లో



ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో నూతన పార్టీ 'పీఆర్పీ'

- ఏపీలో కొత్త పార్టీని ప్రకటించిన విజయసాయిరెడ్డి
- పరివర్తన రాజనీతి పార్టీని ప్రకటించిన విజయసాయిరెడ్డి
- కొత్త పార్టీ జెండాను ఆవిష్కరించిన విజయసాయి
- ఏపీ రాజకీయాల్లోకి మరో కొత్త వేదిక

అమరావతి :

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో నూతన పార్టీ ఆవిర్భవించింది. మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి తన కొత్త రాజకీయ పార్టీని అధికారికంగా ప్రకటించారు. పార్టీ పేరు 'పరివర్తన రాజనీతి పార్టీ' (పీఆర్పీ) అని ఆయన వెల్లడించారు. విజయవాడలో నిర్వహించిన సభలో వేదపండితుల ఆశీర్వచనాల నడుమ - మిగతా 2 లో

స్థానిక పోరులో వైసీపీ
ఓటింగ్ శాతం పెరిగింది



- వైసీపీ అధినేత జగన్
- తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో పలు జిల్లాల నేతలతో జగన్ కీలక భేటీ
- స్థానిక సంస్థల ఎన్నికల్లో చంద్రబాబు ప్రభుత్వం తీవ్ర అక్రమాలకు పాల్పడిందని ఆరోపణ
- ఎన్నికల నిర్వహణలో సరికొత్త ఆవిష్కరణలు తీసుకొచ్చారంటూ వ్యంగ్యం

ఖరీఫ్ నాటికి లిఫ్ట్ ఇరిగేషన్
ప్రాజెక్టులు సిద్ధం కావాలి

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- రూ.632 కోట్లతో 789 ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు
- ఖరీఫ్ నాటికి సాగునీరు అందించేలా పనులు పూర్తి చేయాలన్న చంద్రబాబు
- జలహారతి కార్పొరేషన్ ఆధ్వర్యంలో పథకాల పర్యవేక్షణ
- ఇరిగేషన్ భూముల్లో 903 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రణాళిక
- 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను రెండున్నరేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యం

అమరావతి :

గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురై నిర్వీర్యమైన ఎత్తిపోతల పథకాలను (లిఫ్ట్ ఇరిగేషన్) తక్షణమే పునరుద్ధరించాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాబోయే ఖరీఫ్ సీజన్ నాటికి ఈ పథకాల ద్వారా రైతులకు సాగునీరు అందించేలా యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాల నిర్వహణ, సౌర విద్యుత్ ఉత్పత్తి తదితర అంశాలపై నేడు ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.రాష్ట్రవ్యాప్తంగా మరమ్మతుల దశలో ఉన్న 789 ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు రూ.632.07 కోట్లు అవసరమవుతాయని అధికారులు ముఖ్యమంత్రికి నివేదించారు. ఈ పనులు పూర్తి చేయడం ద్వారా సుమారు 7.49 లక్షల ఎకరాల ఆయకట్టుకు స్థిరంగా సాగునీరు అందించవచ్చని వివరించారు. దీనిపై స్పందించిన సీఎం, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను అంచనా వేసి, వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని ఆదేశించారు.వచ్చే జూన్ నాటికి ఈ పథకాలన్నీ వినియోగంలోకి రావాలని గడువు విధించారు. ఈ పథకాల పర్యవేక్షణ, నిర్వహణ బాధ్యతలను 'జలహారతి కార్పొరేషన్' ద్వారా చేపట్టాలని, ఇందుకోసం ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. అవసరమైతే ప్రతి జిల్లాకు ఒక చీఫ్ ఇంజినీర్ లేదా సూపరింటెండింగ్ ఇంజినీర్‌ను నియమించి పర్యవేక్షణను పటిష్టం చేయాలని తెలిపారు.సమీక్షలో భాగంగా జలవనరుల శాఖ పరిధిలోని భూముల్లో సౌర విద్యుత్ ఉత్పత్తి అవకాశాలపై కూడా చర్చించారు. - మిగతా 2 లో

సంపాదకీయం

కాలుష్యంతో దాగుడుమూతలు



దీపావళి టపాసుల ప్రభావంతో వాయుకాలుష్యం పెరుగుతుందన్నది కాదనలేని నిజం. పండుగ ముగిసినా ఆ బాణాసంచా పొగవీడక దేశవ్యాప్తంగా చాలా నగరాల్లో గాలినాణ్యత బాగా పడిపోయి జనం ఇబ్బంది పడుతున్నారు. దేశరాజధాని ఢిల్లీ వేరు. అక్కడ శీతాకాలం దగ్గరపడుతున్నప్పటికే సమస్య తీవ్రంగా ఉంటుంది. దీపావళినాటికే జనం వాయుకాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతూంటారు. అందుకే, ఏటా టపాసులు కాల్చడం మీద కోర్టులో కేసులు, వాదోపవాదాలు, అంతిమంగా న్యాయస్థానం ఏవో కొన్ని నియంత్రణలతో సరేననడం అనవాయితీగా వస్తోంది. అయితే, ఈ ఏడాది ఢిల్లీ గత ఐదేళ్ళలోనే అత్యంత కాలుష్యకారక దీపావళి జరుపుకుంది. అధికారిక లెక్కల్లో దాని ఏక్యూఐ 400 వరకూ ఉన్నా, అనధికారికంగా అది మరో నాలుగింతలు.దీపావళి రాత్రి కాలుష్యం ప్రపంచ ఆరోగ్యసంస్థ పరిమితులకు 66రెట్లు ఉందన్న ఈ లెక్కలన్నీ కూడా, ఢిల్లీ దాని పరిసర ప్రాంతాల్లోని సగానికి పైగా పొల్యూషన్ మానిటరింగ్ స్టేషన్ల నుంచి డేటా రాకపోయిన తరువాతే. కాలుష్యాన్ని లెక్కగట్టే ఈ స్టేషన్లు దీపావళినాడే పనిచేయకపోవడానికి కారణం ఏమైవుంటుందో ఊహకు అందనిదేమీ కాదు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకూ కీలకవివరాలు నమోదు కాకుండాపోవడం వెనుక, పరికరాల వైఫల్యం ఉన్నదని ఎవరూ అనుకోరు. వాటి సామర్థ్యాన్ని మించి కాలుష్యం ఉండటంతో అవి షాక్ తిన్నాయో, డేటా మాయం చేస్తే కాలుష్యం కూడా మాయమైపోతుందని అధికారులూ పాలకులూ అనుకున్నారో తెలియదు. ప్రైవేటు సంస్థలు లేదా అంతర్జాతీయ యాప్‌లు చూపించే డేటాకూ అధికారిక డేటాకూ మధ్య తేడాలు ఉండవచ్చు, లెక్కించే విధానాలు వేర్వేరు కావచ్చు. కొన్ని ప్రాంతాల్లో ఏక్యూఐ నాలుగుసంఖ్యల్లో ఉన్నంతమాత్రాన నగరం మొత్తం ఆ స్థాయి కాలుష్యాన్ని ఎదుర్కొందని ఎవరూ అనడం లేదు. కానీ, అత్యంత కీలకమైన రోజున, కాలుష్యాన్ని గణించే ప్రమాణాలు కనబడకపోవడం మాత్రం ప్రభుత్వాన్ని అనుమానించేందుకు అవకాశం కల్పిస్తుంది. హిందువుల పండుగ దీపావళితో ముడిపెట్టే మీరు ఎప్పుడూ కాలుష్యం గురించి ఎందుకు మాట్లాడతారు? అని ఢిల్లీ బీజేపీ నాయకులు ఆప్, కాంగ్రెస్‌ను విమర్శిస్తున్నారు. అందువల్ల, కాలుష్యం గురించి ఎవరూ అడగకుండా చేయడానికే ఢిల్లీ ప్రభుత్వం డేటా దాచేసిందని అక్కడి ప్రజలు నమ్మే ప్రమాదం ఉంటుంది. తనను మళ్ళీ తప్పుదోవపట్టిస్తున్నారని సర్వోన్నతన్యాయస్థానమూ బాధపడవచ్చు. 20 కొత్త మానిటరింగ్ స్లేషన్లను ఢిల్లీకి అత్యంత దూరంలో నిర్మించడం, వాటిమీద నీరుచల్లడం కూడా ప్రజలను మోసం చేయడానికేనన్న ఆప్ నాయకుల వాదనను కూడా జనం నమ్మేందుకు వీలుంది.దీపావళి ముందురోజుకే ఢిల్లీ కాలుష్యం ప్రమాదకర దశలోకి చేరింది. అందుకు పంజాబ్‌లో పంటవ్యర్థాలు తగలబెట్టడం సహా చాలా కారణాలు ఉండవచ్చు. అయినా, అనేకానేక రూపాల్లో కమ్ముకున్న ఈ కాలుష్యాన్ని నియంత్రించేందుకు ఎన్నో చర్యలు తీసుకుంటున్నట్టు ఢిల్లీ ప్రభుత్వం కోర్టుకు చెప్పుకొని, పలు ఆంక్షలు, నియంత్రణలతో బాణాసంచాకు అనుమతి సాధించింది. తాము నిర్దేశించిన ఆ కొద్దిగంటల్లోనే ఢిల్లీ ప్రజలు టపాసులు కాల్చుకుంటారని బహుశా తీర్పుచెప్పిన న్యాయమూర్తులు కూడా నమ్మివుండరు. ఉదయం ఒకగంట, రాత్రి ఓ రెండుగంటపాటు మాత్రమే టపాసులు కాల్చుకోవచ్చునని కోర్టు ఇచ్చిన తీర్పు తీవ్ర ఉల్లంఘనకు గురైంది. కొన్ని ప్రాంతాల్లో రోజంతా, అర్ధరాత్రి దాటిన తరువాత కూడా టపాసులు కాల్చినందున, గాలి నాణ్యత దారుణంగా పడిపోయి, కొన్ని చోట్ల ఎక్యూఐ 2200వరకూ ఉండటంలో ఆశ్చర్యమేమీ లేదు. గ్రీన్‌క్రాకర్స్ పేరిట ఇచ్చిన అనుమతి కూడా వ్యాపారులు, అధికారుల చేతివాటంతో తీవ్రంగా దుర్వినియోగమైంది. ప్రజలు వాటినే పూర్తిగా వాడలేదని ఈ ప్రమాదకర పరిస్థితులు తెలియచెబుతున్నాయి. దీపావళి రాత్రి పీఎం 2.5స్థాయి, సల్ఫర్ డయాక్సయిడ్ స్థాయి ఊహకు అందనంతగా పెరిగిపోయాయి. టపాసుల పెట్టెలపై క్యూఆర్ కోడ్లు, ప్రత్యేక విక్రయకేంద్రాల వంటి కోర్టు ఆదేశాలన్నీ నామమాత్రమైపోయి, బాణాసంచాను అనుమతించిన న్యాయస్థానాన్ని ప్రజలు సోషల్ మీడియాలో తప్పుబట్టే పరిస్థితి ఏర్పడింది. తప్పుడు కాలుష్య సమాచారం అన్ని వ్యవస్థల పనితీరునూ దెబ్బతీస్తుంది, పరిష్కారమార్గాల సరికొత్త అన్వేషణకు ఆటంకం ఏర్పడుతుంది. ప్రజలకు, మరీముఖ్యంగా దీపావళినాడు టపాసులు కాల్చిన వారికి వాస్తవం తెలియడం అవసరం. కాలుష్యాన్ని దాచేయడం వల్ల ప్రభుత్వమే ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టినట్టు అవుతుంది. సంస్థాగత జవాబుదారీతనం, ప్రజల్లో అవగాహన, నివారణ చర్యలకోసం కచ్చితమైన డేటా అవసరం. రక్తపోటుకైనా, కాలుష్యం కాటుకైనా యంత్రాలు సరిగా పనిచేయకపోతే ప్రాణానికే ప్రమాదం.

ఖరీఫ్ నాటికి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు సిద్ధం కావాలి

మొదటిపేజీ తరువాయి - జలవనరుల శాఖ, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 4,171 ఎకరాల భూమిలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం ద్వారా 903.1 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చని అధికారులు సీఎంకు వివరించారు. కేవలం భూములే కాకుండా కాలువలపై కూడా సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. సాగు సీజన్‌లో ఎత్తిపోతల పథకాలకు నిరంతరాయంగా విద్యుత్ అందించి, మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించడం ద్వారా ఆదాయం పొందే మార్గాలను అన్వేషించాలని తెలిపారు.విద్యుత్ రంగానికి ఉన్నట్లుగానే జలవనరుల శాఖకు కూడా 'వాటర్ రెగ్యులేటరీ కమిషన్' ఏర్పాటు చేసే అంశాన్ని అధ్యయనం చేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. పోర్టులు, విద్యుత్ రంగాల తరహాలోనే సాగునీటి రంగంలోనూ ఒక నియంత్రణ వ్యవస్థ అవసరమని అభిప్రాయపడ్డారు. రవాణా, పరిశ్రమలు, వ్యవసాయం వంటి వివిధ రంగాలకు నీటి కేటాయింపులపై ఈ కమిషన్ నిర్ణయాలు తీసుకునేలా వ్యవస్థను తీర్చిదిద్దవచ్చన్నారు.ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా గుర్తించిన 36 సాగునీటి ప్రాజెక్టులను రాబోయే రెండున్నరేళ్లలో పూర్తి చేయాలని సీఎం లక్ష్యం నిర్దేశించారు. ఈ ప్రాజెక్టులకు నిధుల కొరత రానివ్వబోమని హామీ ఇచ్చారు. నిర్దేశిత గడువులోగా పనులన్నీ పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

3 నెలల పాటు రాయితీపై నిత్యావసరాలు

మొదటిపేజీ తరువాయి - దుకాణాల ద్వారా పంపిణీ చేయాలని నిశ్చయించింది.ఈ పథకంలో భాగంగా కిలో కందిపప్పును రూ.100, లీటరు పామాయిల్‌ను రూ.125, కిలో గోధుమ పిండిని రూ.25 చొప్పున పంపిణీ చేయనున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు ధర కిలోకు రూ.170 నుంచి రూ.200 వరకు ఉండటంతో, ప్రభుత్వ నిర్ణయం పేద కుటుంబాలకు ఆర్థికంగా పెద్ద ఊరటనివ్వనుంది.ఈ పథకం అమలుకు ప్రభుత్వం నెలకు రూ.100.20 కోట్లు, మూడు నెలల కాలానికి మొత్తంగా రూ.300.60 కోట్ల మేర సబ్సిడీ భారాన్ని భరించనుంది. ఈ మేరకు పౌరసర ఫరాల శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కందిపప్పు సరఫరా నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని 1.20 లక్షల టన్నుల నిల్వలను కోరగా, ప్రస్తుతం 40,338 టన్నుల ముడి కందులను కేంద్రం కేటాయించింది.కేంద్రం కేటాయించిన ముడి కందులను సేకరించి, మిల్లింగ్ ప్రక్రియ పూర్తి చేసి పంపిణీకి సిద్ధం చేయాలని, అలాగే పామాయిల్ సేకరణకు తక్షణ చర్యలు చేపట్టాలని పౌరసరఫరాల శాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఈ పథకాన్ని మూడు నెలల అనంతరం కూడా కొనసాగించాలంటే ప్రభుత్వ ముందస్తు అనుమతి తప్పనిసరని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

పట్టభద్రుల ఓటరు నమోదు తీరుపై కవిత ఆందోళన

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన కవిత

ఓటుతోనే మార్పు సాధ్యమని వ్యాఖ్య

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎన్ని పోరాటాలు చేసినా రాష్ట్రంలో ఎలాంటి మార్పు రాలేదని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో సర్వమత ప్రార్థనల అనంతరం ఆమె గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, ప్రజలు ఓటు ద్వారా ఇచ్చే తీర్పుతోనే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.రాష్ట్రంలో త్వరలోనే 77 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయని కవిత తెలిపారు. తెలంగాణలోని 4 కోట్ల జనాభాలో దాదాపు 80 లక్షల మంది వరకు గ్రాడ్యుయేట్లు ఉన్నారని, అయితే అందులో కనీసం 10 లక్షల మంది కూడా ఓటర్లుగా నమోదు చేసుకోకపోవడం బాధాకరమన్నారు. అర్హులైన పట్టభద్రులంతా వెంటనే ఓటు నమోదు చేసుకోవాలని, తమ ఓటు హక్కు ద్వారా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు తగిన బుద్ధి చెప్పాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ ఏకంగా రూ.200 కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధమవుతోందని కవిత ఆరోపించారు. యువత ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, డబ్బులకు అమ్ముడుపోకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేసేందుకు తమ పార్టీ అభ్యర్థులకు వీర తిలకం దిద్ది ఎన్నికల యుద్ధరంగంలోకి దించుతున్నామని ఆమె పేర్కొన్నారు.

స్థానిక పోరులో వైసీపీ ఓటింగ్ శాతం పెరిగింది

మొదటిపేజీ తరువాయి - ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కూటమి ప్రభుత్వం తీవ్ర అక్రమాలకు పాల్పడిందని వైసీపీ అధినేత జగన్ ఆరోపించారు. ఎన్నికల అక్రమాల్లో చంద్రబాబు సరికొత్త ఆవిష్కరణలు తీసుకొచ్చారంటూ వ్యంగ్యం ప్రదర్శించారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో పలు జిల్లాలకు చెందిన పార్టీ నేతలతో జగన్ ఈరోజు సమావేశమయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగిన తీరు, ఫలితాలపై నేతలతో ఆయన చర్చించారు.ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... "చంద్రబాబు ప్రభుత్వం చేసిన అక్రమాలను ప్రజలంతా చూశారని, వాస్తవాలను ప్రజలు కూడా బాగా అర్థం చేసుకున్నారని" పేర్కొన్నారు. ఎన్నికలు ఏమాత్రం సజావుగా జరిగి



ఉన్నా వైసీపీకి అనుకూలంగా ఇంకా భారీగా ఓటింగ్ శాతం నమోదయ్యేదని అన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి నామినేషన్లు, పోలింగ్, ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశలోనూ అడ్డంకులు సృష్టించి అక్రమాలకు తెగబడ్డారని ఆరోపించారు.అన్ని రకాల అవకతవకలు, దాడులు జరిగినప్పటికీ వైసీపీకి ప్రజా మద్దతు తగ్గలేదని జగన్ స్పష్టం చేశారు. "2024 ఎన్నికలతో పోలిస్తే వైసీపీ ఓటింగ్ శాతం పెరిగింది" అని ఆయన వెల్లడించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశలోనూ అరాచకాలు, అన్యాయాలు చోటుచేసుకున్నప్పటికీ పార్టీ ఓటింగ్ శాతం పెరగడం వైసీపీ పట్ల ప్రజల్లో ఉన్న ఆదరణకు స్పష్టమైన నిదర్శనమని జగన్ వ్యాఖ్యానించారు. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం శ్రమించిన నేతలు, కార్యకర్తలకు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో నూతన పార్టీ 'పీఆర్పీ'

మొదటిపేజీ తరువాయి - ఆయన పార్టీ పేరును ప్రకటించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. జెండాను కాషాయ, తెలుపు రంగులతో రూపొందించారు. జెండా మధ్యలో ధర్మచక్రం గుర్తును ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరైన మద్దతుదారులు, అభిమానులతో విజయసాయిరెడ్డి 'పీఆర్పీ' అంటూ నినాదాలు చేయించారు. సభకు వచ్చిన కార్యకర్తలు 'జై శ్రీరామ్', 'విజయసాయిరెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అభిమానులు ఆయనను భారీ గజమాలతో ఘనంగా సత్కరించారు.రాష్ట్రంలో ప్రస్తుతం స్పష్టమైన రాజకీయ శూన్యత ఉందని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. అధికారంలో ఉన్న టీడీపీ, ప్రతిపక్ష వైఎస్సార్సీపీ రెండింటి తీరుతో ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, ఈ నేపథ్యంలో ప్రజలకు బలమైన ప్రత్యామ్నాయం అవసరమని భావించి కొత్త పార్టీని తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు. రెండు పార్టీలు, రెండు కుటుంబాల రాజకీయ ఆధిపత్యానికి ముగింపు పలకడమే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు.దేశభక్తి, ప్రజా సంక్షేమం, ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల పరిరక్షణే ధ్యేయంగా తమ పార్టీ పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఏపీని కేవలం రెండు కుటుంబాలు మాత్రమే పాలించాలా అని ఆయన ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఒకప్పుడు వైసీపీ కీలక నేతగా పనిచేసిన విజయసాయిరెడ్డి, ఇప్పుడు సొంతంగా పార్టీని స్థాపించి ప్రత్యక్ష రాజకీయాల్లో సరికొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు.

రూ.3,230 కోట్లతో 'యుగే యుగీ భారత్' మ్యూజియం


మొదటిపేజీ తరువాయి - అధికారికంగా ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం రూ.3,230 కోట్లుగా నిర్ణయించారు.న్యూఢిల్లీలోని రైసినా హిల్స్‌పై రాష్ట్రపతి భవన్‌కు ఇరువైపులా ఉన్న చారిత్రక నార్త్, సౌత్ బ్లాకుల్లో ఈ సరికొత్త జాతీయ మ్యూజియాన్ని ఏర్పాటు చేయనున్నారు. 1912 నుంచి 1931 మధ్య కాలంలో నిర్మించిన ఈ కట్టడాల్లో ప్రస్తుతం కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలు ఇతర నూతన భవనాల్లోకి మారిన తర్వాత, వాటిని ప్రజా సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దుతారు. ఈ క్రమంలో భవనాల అసలు శైలి, చారిత్రక నిర్మాణ వారసత్వానికి ఎలాంటి విఘాతం కలగకుండా పునరుద్ధరించనున్నారు.ఈ మ్యూజియం ద్వారా భారతదేశ అనాది నాగరికతా ప్రయాణం, వైవిధ్యం, భౌతిక మరియు అభౌతిక వారసత్వాన్ని సమగ్రంగా ప్రదర్శించనున్నారు. అత్యాధునిక ఇమ్మర్సివ్ సాంకేతికత, సందర్శకులను ఆకట్టుకునే ప్రత్యేక థీమాటిక్ గ్యాలరీలతో అంతర్జాతీయ స్థాయి మ్యూజియాలకు ధీటుగా దీనిని రూపొందిస్తున్నారు. పూర్తయిన తర్వాత సుమారు 1,78,509 చదరపు మీటర్ల విస్తీర్ణంతో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రదర్శనా స్థలం (డిస్‌ప్లే ఏరియా) కలిగిన మ్యూజియంగా ఇది రికార్డు సృష్టించనుంది.ఈ ప్రాజెక్టును 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి 2030-31 వరకు దశలవారీగా పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా మొదటి పబ్లిక్ గ్యాలరీ అయిన 'అడోర్న్‌మెంట్'ను నార్త్ బ్లాక్‌లో 2027 ద్వితీయార్ధంలో సందర్శకులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ మ్యూజియాన్ని ఏటా దాదాపు ఒక కోటి మందికి పైగా సందర్శిస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.కేబినెట్ ఆమోదించిన రూ.3,230 కోట్ల నిధులను గ్యాలరీల అభివృద్ధి, ప్రాచీన వస్తువుల భద్రత, పరిరక్షణ, సందర్శకుల సౌకర్యాలు, ల్యాండ్‌స్కేపింగ్, ఇంటెలిజెంట్ బిల్డింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, అధునాతన మౌలిక వసతుల కల్పన కోసం వినియోగిస్తారు. భవిష్యత్తులో టికెట్ల విక్రయాలు, ఆహార మరియు పానీయాల విభాగాలు, ప్రత్యేక కార్యక్రమాల వేదికల అద్దెలు, డిజిటల్ అనుభవాలు, గైడెడ్ టూర్లు మరియు ప్రత్యేక రిటైల్ ఔట్‌లెట్ల ద్వారా మ్యూజియానికి అవసరమైన ఆదాయాన్ని సమకూర్చుకోనున్నారు.ఈ ప్రాజెక్టును ప్రధాని నరేంద్ర మోదీ 2023 మే 18న తొలిసారిగా ప్రకటించగా, 2026 జూలై 27న పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు దీనికి ప్రాథమిక అనుమతులు మంజూరు చేసింది. తాజా కేబినెట్ ఆమోదంతో పనులు మరింత వేగవంతం కానున్నాయి.ం

దేశంలోనే క్లీనెస్ట్ సిటీగా నవీ ముంబయి

మొదటిపేజీ తరువాయి - ఈ జాబితాలో సూరత్ రెండో స్థానంలో నిలవగా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విజయవాడ మూడో స్థానాన్ని దక్కించుకుంది. దిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విజేతలకు ఈ స్వచ్ఛతా పురస్కారాలను ప్రదానం చేశారు. 10 లక్షల పైబడిన జనాభా కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కే చెందిన గ్రేటర్ విశాఖపట్నం (+ఎవీజ) దేశంలోనే క్లీనెస్ట్ సిటీగా మొదటి స్థానంలో నిలిచింది. ఈ విభాగంలో వైజాగ్ తర్వాతి స్థానాల్లో జబల్‌పూర్, లఖ్‌నవూ వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. 3 నుంచి 10 లక్షల జనాభా విభాగంలో మధ్య ప్రదేశ్‌లోని ఉజ్జయిన్ తొలి స్థానం దక్కించుకోగా, చండీగఢ్ రెండో స్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు మూడో స్థానంలో నిలిచి సత్తా చాటాయి. గత 8 సంవత్సరాలుగా వరుసగా దేశంలోనే క్లీనెస్ట్ సిటీగా అగ్రస్థానంలో నిలుస్తూ వచ్చిన మధ్యప్రదేశ్‌లోని ఇందౌర్ ఈ ఏడాది టాపర్ల జాబితాలో చోటు దక్కించుకోకపోవడం గమనార్హం.

ప్రభుత్వ వాహనాలుగా ఎలక్ట్రిక్ కార్లే మొదటి ప్రాధాన్యత

మొదటిపేజీ తరువాయి - ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు ఎలక్ట్రిక్ వాహనాలను ప్రాథమిక, ప్రాధాన్య ఎంపికగా (డిఫాల్ట్ అండ్ ప్రిఫర్డ్ ఛాయిస్) నిర్ణయిస్తూ ఆర్థిక శాఖ పరిధిలోని వ్యయ విభాగం (డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎక్స్‌పెండిచర్) అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.



ఈ కొత్త నిబంధనలు తక్షణమే అమల్లోకి వస్తాయని వెల్లడించింది.కేంద్ర ప్రభుత్వ తాజా ఆదేశాల ప్రకారం.. మంత్రిత్వ శాఖలు, విభాగాలు కొనుగోలు చేసే ఎలక్ట్రిక్ కార్ల గరిష్ఠ డీలర్ ధర (నెట్ డీలర్ ప్రైస్) పరిమితిని రూ.20 లక్షలకు పెంచారు. గతంలో ఉన్న పరిమితితో పోలిస్తే ఇది రెట్టింపు కావడం గమనార్హం. అదే సమయంలో పెట్రోల్, డీజిల్, హైబ్రిడ్ వంటి సాంప్రదాయ అంతర్గత దహన ఇంజిన్ (ఐసీఈ) వాహనాల గరిష్ఠ కొనుగోలు ధర పరిమితిని రూ.10 లక్షలుగా ఖరారు చేశారు. దేశంలో ఎలక్ట్రిక్ మొబిలిటీని వేగవంతం చేయడం, శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించడం, మార్కెట్ పరిస్థితులు మరియు వాహనాల దీర్ఘకాలిక నిర్వహణ వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.ఇకపై వివిధ శాఖల్లోని పాత ఐసీఈ కార్లను తొలగించినప్పుడు (కండెమ్నేషన్) లేదా వాటి స్థానంలో కొత్త వాహనాలను సమకూర్చుకోవాల్సి వచ్చినప్పుడు సాధారణంగా ఎలక్ట్రిక్ కార్లనే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. కేవలం కొత్త వాహనాల కొనుగోలుకే కాకుండా, కార్యాలయ అవసరాల కోసం కార్లను అద్దెకు తీసుకునే సందర్భాల్లో కూడా ఈవీలకే ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. 2022 సెప్టెంబర్ 1న జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా అద్దె వాహనాల ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని ఉత్తర్వుల్లో పేర్కొంది.అయితే, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం లేదా కొనుగోలు ఆచరణాత్మకం కాదని భావిస్తే మాత్రం ఐసీఈ వాహనాల కొనుగోలుకు మినహాయింపు కోరే అవకాశం కల్పించారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు, బలమైన కారణాలతో కూడిన ప్రతిపాదనను వ్యయ విభాగానికి పంపాల్సి ఉంటుంది. ఈ ప్రతిపాదనకు సంబంధిత మంత్రిత్వ శాఖ లేదా విభాగం కార్యదర్శి ఆమోదం, ఫైనాన్షియల్ అడ్వైజర్ ఏకీభావం తప్పనిసరి. ఆయా ప్రతిపాదనలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే వ్యయ విభాగం మినహాయింపులపై నిర్ణయం తీసుకుంటుంది. వాహనాల కొనుగోలు ప్రక్రియ మొత్తం జనరల్ ఫైనాన్షియల్ రూల్స్ (జీఎఫ్ఆర్) 2017 నిబంధనలకు లోబడి కొనసాగుతుందని కేంద్రం స్పష్టం చేసింది.

అగ్ర దేశాలతో పోటీపడేలా విద్యా సంస్కరణలు



మొదటిపేజీ తరువాయి - విద్యానగర్‌లో నూతన 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' భవన నిర్మాణానికి ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. స్థానిక బీసీ వెల్ఫేర్ బాలుర వసతిగృహం ప్రాంగణంలో సుమారు రూ.10 కోట్ల నుంచి రూ.11 కోట్ల అంచనా వ్యయంతో ఈ పాఠశాల భవనాన్ని నిర్మించనున్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ... దేశంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్రంలో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్', 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్' ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ప్రపంచంలోని పది అగ్రదేశాలతో తెలంగాణ విద్యార్థులు పోటీపడేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యావ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తూ పటిష్ఠపరుస్తున్నారని పేర్కొన్నారు.కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగానే సెమీ రెసిడెన్షియల్ విధానంలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను అందుబాటులోకి తెస్తున్నట్లు భట్టి విక్రమార్క వివరించారు. ఈ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు డిజిటల్ బోధన అందించడంతో పాటు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రవాణా సదుపాయాలు కల్పిస్తామన్నారు. మరోవైపు, ఉపముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో హనుమకొండలో ముందస్తు చర్యగా మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌తో సహా పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు గృహనిర్బంధంలో ఉంచారు.

ఆంధ్రాకు నీళ్లు తెలంగాణకు ఎక్కిళ్లు ఎందుకు

ఎత్తిపోయడం లేదన్నారు. ఆంధ్రాకు నీళ్లు, తెలంగాణకు ఎక్కిళ్లు ఎందుకని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డికి రైతులు, నీళ్లపై పట్టింపు లేదన్నారు.ఉమ్మడి ఆదిలాబాద్ రైతుల కోసం కేసీఆర్ సదర్మాట్ ద్యాం కట్టినా కాంగ్రెస్‌కు, దాన్ని వినియోగించుకోవడం రావడం లేదని కేటీఆర్ విమర్శించారు. కాళేశ్వరం నుంచి నీళ్లు నిజాంసాగర్‌కు ఎత్తిపోస్తే, ఎల్‌నినో వచ్చినా ఇన్ని తిప్పలు వచ్చేవి కాదన్నారు. రైతుల కన్నీళ్ల కన్నా తన గద్దంమీదే ముఖ్యమంత్రికి దృష్టి ఎక్కువగా ఉందని కేటీఆర్ ఆక్షేపించారు. ఎల్‌నినో గురించి సీఎం రైతులకు ధైర్యం చెప్పడం లేదని, కరోనా సమయంలో కేసీఆర్ అందరికీ అండగా నిలిచారని వ్యాఖ్యానించారు. ప్రజల దృష్టి మళ్లించేందుకే ఊళ్లో నాటకాలు వేయాలని ముఖ్యమంత్రి చెప్తున్నారని, నాటకాలు, ఉపన్యాసాలతో రైతుల కడుపు నిండదన్నారు.ఆదిలాబాద్ జిల్లాలోని గూడేలను కేసీఆర్ గ్రామపంచాయతీలు చేశారని కేటీఆర్ అన్నారు. ఆదిలాబాద్‌లోని 4.5 లక్షల ఎకరాలకు కేసీఆర్ పోడు పట్టాలిచ్చారన్నారు. తాము ప్రతి గ్రామానికో ట్రాక్టర్ కొనిస్తే, వాటికి డీజిల్ పోయడానికి కూడా కాంగ్రెస్‌కు చేతకావడం లేదన్నారు. మూడేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.4.5 లక్షల కోట్లు అప్పుచేసిందని ఆరోపించారు. అమ్మఒడి వాహనాలు, గర్భిణులు, బాలింతలకు ప్రసూతి సహాయం ఆపేశారని మండిపడ్డారు. అధికారంలోకి వస్తే విద్యా భరోసా ఇస్తామని, ఇప్పుడు రూ.12 వేల కోట్లు ఫీజు రియంబర్స్‌మెంట్ బాకీలుపెట్టారని ఆరోపించారు.ఉద్యోగ ప్రకటనలు ఇవ్వకుండా, నిరుద్యోగ భృతి చెల్లించకుండా యువతను రేవంత్ ప్రభుత్వం ఆగం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులకు పీఆర్సీ, డీఏలు, రిటైర్డ్ ఉద్యోగుల పింఛన్లు ఇవ్వడం లేదని ఆరోప

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
గురువారం 12 - 11 - 2026

స్వాతంత్ర్య సమరయోధులు

మౌలానా ఆజాద్ సేవలు స్ఫూర్తిదాయకం



అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 11) : ప్రతినిధి : భారత తొలి విద్యాశాఖ మంత్రి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి (జాతీయ విద్యా దినోత్సవం) సందర్భంగా అనంతపురం జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఘనంగా నివాళులర్పించారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ ఎం. నాగభూషణం, ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుడిగా, విద్యావేత్తగా, రచయితగా, పాత్రికేయుడిగా మౌలానా ఆజాద్ దేశానికి విశేష సేవలందించారని కొనియాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొనడంతో పాటు దేశ ఐక్యత, సమగ్రత, మత సామరస్యం కోసం ఆయన ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. స్వతంత్ర భారత తొలి విద్యాశాఖ మంత్రిగా దేశ విద్యారంగ అభివృద్ధికి బలమైన పునాదులు వేశారని, ముఖ్యంగా ఐఐటీలు, విశ్వవిద్యాలయాల ఏర్పాటుతో పాటు సాంకేతిక విద్య విస్తరణకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. విద్యారంగానికి ఆజాద్ చేసిన సేవలకు గుర్తింపుగా ఆయన జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటున్నామని, దేశానికి ఆయన అందించిన సేవలకు గాను 1992లో భారత ప్రభుత్వం మరణానంతరం 'భారతరత్న' పురస్కారంతో గౌరవించిందని తెలిపారు. ఆజాద్ దేశభక్తి, జాతీయ సమైక్యత, విద్యా దృక్పథం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని అధికారులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ పవన్ కుమార్, పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, ఆర్ఎస్ఐ జాఫర్, లక్ష్మీనారాయణతో పాటు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల అక్రమాలను నిరసిస్తూ నల్ల బ్యాడ్జీలతో సీపీఎం నిరసన



ధర్మవరం (తెలుగు కలం) (నవంబర్ 11) : ప్రతినిధి : ఇటీవల జరిగిన మున్సిపల్, పరిషత్ ఎన్నికలలో చోటుచేసుకున్న అక్రమాలపై సీపీఎం నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల అక్రమాలకు నిరసనగా బుధవారం స్థానిక కళాజ్యోతి సర్కిల్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ఎదుట సీపీఎం శ్రేణులు కళ్లకు నల్ల బ్యాడ్జీలు ధరించి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ, ఎన్నికల్లో జరిగిన అక్రమాలను ప్రజాస్వామ్యవాదులందరూ ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల దశలోనే ప్రత్యర్థులను బెదిరింపులకు గురిచేయడమే కాకుండా, బలవంతపు ఉపసంహరణలు చేయించారని ఆయన ఆరోపించారు. కూటమి, టీడీపీ ప్రభుత్వం తమ అధికార బలాన్ని దుర్వినియోగం చేసి ఈ ఎన్నికల్లో అక్రమంగా గెలుపొందిందని విమర్శించారు. అంతేకాకుండా, ప్రజాస్వామ్యబద్ధంగా పోటీ చేసిన వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడటం దారుణమని పెద్దన్న ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అక్రమాలకు, అధికార దుర్వినియోగానికి సహకరించిన సంబంధిత అధికారులపై రాష్ట్ర ఎన్నికల సంఘం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు ఎస్.హెచ్. భాష, జేవీ రమణ, పట్టణ కార్యదర్శి మారుతి, ఎల్. ఆదినారాయణ, గుంపు హరి, ఖాదర్ భాష, వెంకటస్వామి, మారెప్ప, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల ఆగడాలను

అరికట్టాలి పోలా లక్ష్మీనారాయణ



ధర్మవరం (తెలుగు కలం) (నవంబర్ 11) : ప్రతినిధి : పట్టణంలోని శివారు కాలనీల ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల ఆగడాలు రోజురోజుకు పెచ్చుమీరిపోతున్నాయని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ ధర్మవరం నియోజకవర్గ కార్యదర్శి పోలా లక్ష్మీనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని కేతిరెడ్డి కాలనీలో నివసిస్తున్న నారాయణప్ప అనే వ్యక్తి ఆర్థిక అవసరాల నిమిత్తం రుణం కోసం స్థానికంగా ఉన్న ఫైవ్ స్టార్ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థను ఆశ్రయించాడని ఆయన తెలిపారు. సదరు సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటిని తనఖా పెట్టుకుని రూ. 3,25,000 రుణం మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. అయితే, ఆ మొత్తంలో రిజిస్ట్రేషన్ మరియు ఇన్సూరెన్స్ ఖర్చుల పేరిట ఏకంగా రూ. 1,15,000 మినహాయించుకుని, కేవలం రూ. 2,10,000 మాత్రమే నారాయణప్ప చేతికి ఇచ్చారని వివరించారు. రుణం తీసుకున్నప్పటి నుండి నారాయణప్ప 9 నెలల పాటు ఎటువంటి ఆటంకం లేకుండా సక్రమంగా వాయిదాలు చెల్లిస్తూ వచ్చాడని, అయితే గత 15 రోజుల క్రితం అతను అనారోగ్యంతో మృతి చెందాడని తెలిపారు. లోన్ మంజూరు సమయంలో ఇన్సూరెన్స్ పేరిట భారీగా డబ్బులు వసూలు చేసిన సదరు సంస్థను బాధిత కుటుంబం సంప్రదించగా, ఆ కుటుంబానికి ఎటువంటి న్యాయం చేయలేమని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం దారుణమని మండిపడ్డారు. ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల ఈ అమానుష వ్యవహార శైలిపై సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ తరపున తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నామన్నారు. అధికారులు తక్షణమే స్పందించి నారాయణప్ప కుటుంబానికి న్యాయం చేయాలని, అక్రమాలకు పాల్పడుతున్న ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆజాద్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి: జిల్లా కలెక్టర్



పుట్టపర్తి (తెలుగు కలం) (నవంబర్ 11) : దేశ స్వాతంత్ర్యోద్యమానికి మరియు విద్యారంగానికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ కొనియాడారు. స్వతంత్ర భారత తొలి విద్యాశాఖ మంత్రి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని బుధవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశంలో ఆధునిక విద్యకు, ఐఐటీలు వంటి ప్రతిష్టాత్మక సాంకేతిక విద్యా సంస్థల ఏర్పాటుకు, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ స్థాపనకు మౌలానా అబుల్ కలాం ఆజాద్ బలమైన పునాదులు వేశారని కలెక్టర్ పేర్కొన్నారు. కుల, మతాలకు అతీతంగా జాతి ఐక్యత కోసం ఆయన కృషి చేశారని, కేవలం విద్య ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యపడుతుందని గట్టిగా నమ్మిన గొప్ప దూరదర్శి మౌలానా ఆజాద్ అని తెలిపారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో స్ఫూర్తిగా తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ?ఈ కార్యక్రమంలో రీసర్వే ఎడి విజయ శాంతి, జిల్లా మైనారిటీ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొని మౌలానా ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘన నివాళులర్పించారు.

ఆంజనేయ కోదండ రామస్వామి

ఆలయ హుండీ ఆదాయం రూ. 3.12 లక్షలు



నంద్యాల (తెలుగు కలం) (నవంబర్ 11) : ప్రతినిధి : నంద్యాల పట్టణంలో వెలసిన ప్రసిద్ధ శ్రీ ఆంజనేయ కోదండ రామస్వామి దేవస్థానానికి భక్తుల కానుకల రూపంలో రూ. 3,12,733 హుండీ ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి (ఈఓ) వేణునాథ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన ఈ హుండీ లెక్కింపు ప్రక్రియ బండిఆత్మకూరు కార్యనిర్వాహణాధికారి ఎ. నాగప్రసాద్ పర్యవేక్షణలో అత్యంత పారదర్శకంగా, కట్టుదిట్టమైన భద్రత నడుమ జరిగింది. ఈ సందర్భంగా ఈఓ వేణునాథ్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో నిర్వహించిన హుండీ లెక్కింపుతో పోలిస్తే ఈసారి ఆలయానికి రూ. 82,289 అదనపు ఆదాయం లభించిందని హర్షం వ్యక్తం చేశారు. ఆలయానికి భక్తుల తాకిడి పెరగడం వల్లే ఈ ఆదాయ వృద్ధి సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ వి. అనిల్ కుమార్, ధర్మకర్తల మండలి సభ్యులతో పాటు బాలాజీ సేవా ట్రస్ట్ సభ్యులు, రామస్వామి సేవా సమాజ్ ప్రతినిధులు మరియు స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని లెక్కింపు ప్రక్రియలో తమ సేవలను అందించారు.

బళ్లారిలో అత్యాధునిక 'వెస్టా డయాగ్నస్టిక్ సెంటర్' ప్రారంభం

ఖరీదైన పరీక్షలకు బెంగళూరు వెళ్లాల్సిన అవసరం లేదు: కాలవ శ్రీనివాసులు





(తెలుగు కలం) (నవంబర్ 11) : బళ్లారి నగరం నడిబొడ్డున అత్యాధునిక వైద్య పరికరాలతో వెస్టా డయాగ్నస్టిక్ సెంటర్ ప్రారంభం కావడం సంతోషించదగ్గ విషయమని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం బళ్లారిలో వెస్టా డయాగ్నస్టిక్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా బళ్లారి ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి, మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీలు బి.కే.పార్థ సారథి, అంబికా లక్ష్మీ నారాయణ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధునాతన ఎంఆర్ఐ, సీటీ స్కాన్ యంత్రాలను ఈ కేంద్రంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గత మూడు సంవత్సరాలుగా అనంతపురంలో డాక్టర్ ఆకర్ష్ వెస్టా డయాగ్నస్టిక్ సెంటర్‌ను నిర్వహిస్తూ వైద్య రంగంలో మంచి అనుభవాన్ని సంపాదించుకున్నారని తెలిపారు. అదే అనుభవంతో బళ్లారిలోనూ తాజాగా వెస్టా బ్రాంచ్‌ను ప్రారంభించడం సంతోషకరమన్నారు. ఈ ప్రాంతంలో అనేకమంది స్పెషలిటీ, సూపర్ స్పెషలిటీ వైద్యులు వైద్య సేవలు అందిస్తున్నారని, వివిధ ప్రత్యేక వైద్య కోర్సుల్లో ప్రావీణ్యం సంపాదించిన ప్రముఖ వైద్యులు ఇక్కడ అందుబాటులో ఉన్నారని పేర్కొన్నారు. అయితే, ఎంఆర్ఐ, సీటీ స్కాన్ పరీక్షల్లో కచ్చితమైన సమాచారం లభించని సందర్భాల్లో రోగులను బెంగళూరు వంటి నగరాలకు పంపించాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. ఇలాంటి అత్యాధునిక యంత్ర పరికరాలతో కూడిన కేంద్రాలు అందుబాటులోకి రావడం వల్ల వ్యాధి నిర్ధారణ మరింత సులభతరమవుతుందని, వైద్యులు సరైన చికిత్స అందించేందుకు దోహదపడుతుందని వివరించారు. ఈ ప్రాంత ప్రజలు, ముఖ్యంగా రాయదుర్గం నియోజకవర్గ వాసులు బళ్లారికి వైద్య సేవల కోసం తరచూ వస్తుంటారని తెలిపారు. ఇకపై వారు ఖరీదైన పరీక్షల కోసం బెంగళూరు వంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని, సమయం, డబ్బు ఆదా అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కేంద్రం రాయదుర్గం ప్రాంత ప్రజలకు కూడా మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. లాభాపేక్షతో కాకుండా నాణ్యమైన వైద్య సేవలు అందిస్తారనే నమ్మకం డాక్టర్ ఆకర్ష్‌పై తనకు ఉందన్నారు. ఆయన ఆధ్వర్యంలో వెస్టా డయాగ్నస్టిక్ సెంటర్ దినదినాభివృద్ధి చెందుతూ స్థానిక ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు.

ఫిర్యాదుతో ఆగలేదు.. పొలం వద్దకే వెళ్లి సమస్యను పరిశీలించిన హెచ్ఆర్‌జీఎంఎస్...!

సామాన్యుడి హక్కుల కోసం సమరశంఖం...
అన్యాయంపై హెచ్ఆర్‌జీఎంఎస్ గర్జన
బాధితుడికి న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గేది లేదు...
ఎంతటి వారినైనా ఉపేక్షించం
గుత్తా భాస్కర నాయుడు, ఖాజావలి హెచ్చరిక





గుంతకల్లు నవంబర్ 11 తెలుగు కలం :- రైతుల భూముల విషయంలో అక్రమాలు, అన్యాయాలు చోటుచేసుకుంటే సహించేది లేదని,బాధితులకు న్యాయం జరిగే వరకు నిరంతర పోరాటం సాగిస్తామని హ్యూమన్ రైట్స్ గ్లోబల్ మిషన్ సొసైటీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ గుత్తా భాస్కర నాయుడు,స్టేట్ మీడియా సెక్రటరీ ఖాజావలి గట్టిగా హెచ్చరించారు.రైతుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసే వ్యవస్థకు బాధితుల పక్షాన నిలబడి సమాధానం చెబుతామని స్పష్టం చేశారు.సంస్థ చైర్మన్ కాకర్ల సరస్వతి ఆదేశాల మేరకు ప్రకాశం జిల్లా అద్దంకి మండలం కుంకుపాడు గ్రామ పరిధిలోని వల్లభనేని వెంకట్రావు పొలం సమస్యపై సంస్థ ప్రతినిధులు నేరుగా రంగంలోకి దిగారు.తన భూమికి సంబంధించిన సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వెంకట్రావు తాడిపత్రిలోని హెచ్ఆర్‌జీఎంఎస్ కార్యాలయాన్ని ఆశ్రయించి తన గోడును వెళ్లబోసుకున్నారు. సమస్య తీవ్రతను గుర్తించిన సంస్థ ప్రతినిధులు ఫిర్యాదును స్వీకరించడంతో సరిపెట్టుకోకుండా స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి వాస్తవ పరిస్థితులను పరిశీలించారు.ఈ క్రమంలో అద్దంకి మండలం కుంకుపాడు గ్రామంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శంకర్,సర్వేయర్ కళ్యాణ్‌తో కలిసి వివాదానికి సంబంధించిన పొలాన్ని పరిశీలించారు.అనంతరం అద్దంకి తహసీల్దార్,ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ చరణ్‌ను కలిసి రైతు ఎదుర్కొంటున్న సమస్యను వివరించారు.సంబంధిత భూ రికార్డులను సమగ్రంగా పరిశీలించి ఎలాంటి జాప్యం లేకుండా సమస్యను పరిష్కరించి రైతుకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై తహసీల్దార్ చరణ్ సానుకూలంగా స్పందిస్తూ ప్రత్యేక చొరవ తీసుకుని సాధ్యమైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా గుత్తా భాస్కర నాయుడు మాట్లాడుతూ....రైతు కష్టపడి సంపాదించుకున్న భూమి విషయంలో సమస్యలు ఎదురైతే వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు.ఒక రైతు తన సమస్యను పరిష్కరించుకోవడానికి కార్యాలయాల చుట్టూ తిరుగుతూ కాలం గడపాల్సిన దుస్థితి రాకూడదని అన్నారు. బాధితుడు తమను ఆశ్రయించిన వెంటనే స్పందించి పొలాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడామని తెలిపారు.అధికారులు ఇచ్చిన హామీని నిలబెట్టుకుని రైతుకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.హామీలకే పరిమితమై సమస్యను పెండింగ్‌లో పెడితే మాత్రం చూస్తూ ఊరుకునేది లేదని,న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని, ఈ విషయంలో ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.ఖాజావలి మాట్లాడుతూ....మానవ హక్కుల పరిరక్షణ అంటే కేవలం మాటలకే పరిమితం కావడం కాదని,అన్యాయానికి గురైన వ్యక్తి వద్దకు వెళ్లి అతని సమస్య పరిష్కారం కోసం పోరాడటమే నిజమైన బాధ్యత అని పేర్కొన్నారు.సామాన్య రైతు తన భూమి కోసం న్యాయం అడిగితే అధికారులు స్పందించాల్సిందేనని అన్నారు. వల్లభనేని వెంకట్రావు సమస్య పరిష్కారమయ్యే వరకు సంస్థ తరఫున నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపారు. అధికారుల నుంచి వచ్చిన హామీ అమలు కాకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బాధితుల కన్నీళ్లను పట్టించుకోని వారిని, న్యాయాన్ని అడ్డుకునే వారిని ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.హ్యూమన్ రైట్స్ గ్లోబల్ మిషన్ సొసైటీ రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ ప్రజలకు అన్యాయం జరిగినా బాధితుల పక్షాన నిలబడి వారి హక్కుల పరిరక్షణకు కృషి చేస్తుందని సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. అధికారం ఉన్నవారికి ఒక న్యాయం,సామాన్యులకు మరో న్యాయం అనే ధోరణి కొనసాగితే సహించేది లేదని, బాధితుడికి న్యాయం అందించడమే తమ సంస్థ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

ముందస్తు అడ్మిషన్ల పేరుతో ప్రైవేట్ పాఠశాలల దందా....!

విద్యా నిబంధనలు బేఖాతరు చేస్తే ఉపేక్షించేది లేదు
తల్లిదండ్రులను ఒత్తిడికి గురిచేస్తే కఠిన చర్యలు తప్పవు
నిబంధనలు ఉల్లంఘించే పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి
పీడీఎస్‌యూ డిమాండ్.. గుంతకల్లు పట్టణ నూతన కమిటీ ఎన్నిక





గుంతకల్లు నవంబర్ 11 (తెలుగు కలం): - విద్యను వ్యాపారంగా మార్చి, ముందస్తు అడ్మిషన్ల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షిస్తూ ఆర్థిక భారానికి గురిచేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల తీరుపై ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పీడీఎస్‌యూ తీవ్రంగా స్పందించింది. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ప్రవేశాల పేరుతో ప్రచారాలు నిర్వహిస్తూ తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకురావడం ఏమిటని ప్రశ్నించింది. ప్రభుత్వ విద్యా నిబంధనలను బేఖాతరు చేసే పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు వెంటనే కొరడా ఝళిపించాలని డిమాండ్ చేసింది.గుంతకల్లు పట్టణంలోని న్యూ డెమోక్రసీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పీడీఎస్‌యూ పట్టణ విస్తృత సమావేశానికి నియోజకవర్గ అధ్యక్షుడు పి. అఖిల్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వి.వినోద్ మాట్లాడుతూ... 2027 విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్ల పేరుతో హడావుడి చేస్తున్నాయని విమర్శించారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోవాల్సిన విద్యాసంస్థలు వ్యాపార ధోరణితో వ్యవహరిస్తూ తల్లిదండ్రులను ఆకర్షించే ప్రయత్నాలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ముందస్తు ప్రవేశాల పేరుతో తల్లిదండ్రులను గందరగోళానికి గురిచేస్తూ ఆర్థిక ఒత్తిడికి గురిచేసే విధానాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు నిద్రమత్తు వీడి పట్టణంలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టే విద్యాసంస్థలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే వాటి గుర్తింపును రద్దు చేయాలని స్పష్టం చేశారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

పీడీఎస్‌యూ గుంతకల్లు పట్టణ నూతన కమిటీ ఎన్నిక :-

సమావేశంలో పీడీఎస్‌యూ గుంతకల్లు పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా పి.కమల్ తలారి, కార్యదర్శిగా సాయి,సహాయ కార్యదర్శిగా బి.నవీన్, కోశాధికారిగా బి.రోహిత్ ఎన్నికయ్యారు.ఉపాధ్యక్షులుగా ఎం. అజయ్,పి.సాయితో పాటు ఆరుగురు కార్యవర్గ సభ్యులు, 18 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు.నూతనంగా ఎన్నికైన కమిటీ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని, విద్యారంగంలో జరుగుతున్న అక్రమాలు, ప్రైవేట్ విద్యాసంస్థల నిబంధనల ఉల్లంఘనలపై రాజీలేని పోరాటాలు కొనసాగించాలని నాయకులు పిలుపునిచ్చారు.

స్థానిక ఎన్నికల్లో కూటమి దౌర్జన్యాలపై అనంతలో వామపక్షాల నిరసన



అనంతపురం తెలుగుకలం నవంబర్ 11 : స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం పాల్పడిన అక్రమాలు, దౌర్జన్యాలను నిరసిస్తూ సీపీఐ, సీపీఎం రాష్ట్ర సమితుల పిలుపు మేరకు అనంతపురం నగరంలోని టవర్ క్లాక్ వద్ద ఇరు పార్టీల ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ?ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు ఓబులు, సీపీఐ జిల్లా కార్యదర్శి పి. నారాయణస్వామి మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ఎన్నికల వ్యవస్థను సర్వనాశనం చేసిందని తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రతిపక్ష పార్టీల అభ్యర్థుల నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారుల నుంచే లాక్కొని చించివేసిన ఘటనలు చోటుచేసుకున్నాయని వారు ఆరోపించారు. కేవలం రిగ్గింగ్, దొంగ ఓట్లకు పాల్పడటమే కాకుండా ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేసి బలవంతంగా ఏకగ్రీవాలు చేసుకున్నారని మండిపడ్డారు. ?తాడిపత్రి నియోజకవర్గంలో టీడీపీ నాయకులు జేసీ ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి ఎన్నికల నియమ నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కి ఏకపక్షంగా దౌర్జన్యాలకు పాల్పడుతూ ప్రతిపక్ష అభ్యర్థులను బెదిరించి ఏకగ్రీవాలు చేసుకున్నారని నేతలు విమర్శించారు. అదేవిధంగా కళ్యాణదుర్గం, అనంతపురం నియోజకవర్గాల్లో సైతం ఎమ్మెల్యేలు ఎన్నికల కేంద్రాల్లోకి తమ అనుచరులను తీసుకెళ్లి దౌర్జన్యాలకు పాల్పడటం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార యంత్రాంగాన్ని, ఎన్నికల వ్యవస్థను తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేయడం అత్యంత సిగ్గుచేటని వారు ధ్వజమెత్తారు. ?ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఏ. పద్మావతి, సీపీఐ నగర సహాయ కార్యదర్శి బి. రమణ, జిల్లా కార్యవర్గ సభ్యులు సి. లింగమయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సీపీఎం నగర నాయకులు వలి, ప్రకాష్, వెంకటనారాయణ, ఇర్ఫాన్ పాల్గొన్నారు. వీరితో పాటు సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఎల్లుట్ల నారాయణస్వామి, జె. రామాంజనేయులు, బంగారు బాషా, గౌస్ అన్వర్, ఖాజా మున్నా బాషా, లక్ష్మీనారాయణ, ఖాజా మొహిద్దీన్, ఎం. ఆనంద్, బి. తేజ తదితరులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమ నిరసనను వ్యక్తం చేశారు.

వైఎస్ జగన్‌ను కలిసిన అనంతపురం జిల్లా వైఎస్సార్‌సీపీ నేతలు

కళ్యాణదుర్గం ఎన్నికల పరిణామాలపై

వైఎస్ జగన్‌కు తలారి రంగయ్య నివేదిక

తాడేపల్లి (తెలుగు కలం) (నవంబర్ 11) : ప్రతినిధి : అనంతపురం జిల్లాకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో ఇటీవల జరిగిన మున్సిపల్, పరిషత్ ఎన్నికల పరిణామాలపై వైఎస్సార్‌సీపీ నేతలు పార్టీ అధినేతకు నివేదించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఎన్నికల కౌంటింగ్ సమయంలో తమ పార్టీ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొన్న ఇబ్బందులు మరియు అధికార పక్షం అండతో జరిగినట్లు వారు ఆరోపిస్తున్న అక్రమాలు, దౌర్జన్యాలపై



నేతలు జగన్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా కళ్యాణదుర్గం నియోజకవర్గంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలను మాజీ ఎంపీ, నియోజకవర్గ సమన్వయకర్త డా. తలారి రంగయ్య వివరించారు. స్థానిక ఎమ్మెల్యే అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఫలితాలను ప్రభావితం చేశారని ఆయన ఆరోపించారు. రీకౌంటింగ్ నిర్వహణలో పారదర్శకత లోపించిందని, ఎన్నికల ప్రక్రియపై వచ్చిన ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, పారదర్శకంగా రీకౌంటింగ్ నిర్వహిస్తే వాస్తవాలు బయటకు వస్తాయని తలారి రంగయ్య పేర్కొన్నట్లు పార్టీ ప్రకటనలో వెల్లడించారు. ఈ సమావేశంలో క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసే కార్యాచరణ మరియు భవిష్యత్ రాజకీయ వ్యూహాలపై నేతలు చర్చించారు. జిల్లా నాయకుల పోరాట పటిమను అభినందించిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, కార్యకర్తలు ఐక్యంగా ఉంటూ ప్రజల పక్షాన నిలబడాలని సూచించినట్లు పార్టీ నేతలు తెలిపారు. ఈ భేటీలో రాయలసీమ రీజినల్ కోఆర్డినేటర్, ఎంపీ మిథున్ రెడ్డి, అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపీ డా. తలారి రంగయ్య, సింగనమల సమన్వయకర్త డా. శైలజానాథ్, అనంతపురం పార్లమెంట్ పరిశీలకులు నరేష్ కుమార్ రెడ్డి, మరియు అనంతపురం మేయర్ రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల నిర్వహణలో ఎన్నికల కమిషన్ పూర్తిగా విఫలం సీపీఐ

(తెలుగు కలం) (నవంబర్ 11) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ఎన్నికల కమిషన్ పూర్తిగా విఫలమైందని, ప్రజాస్వామ్య ఎన్నికల వ్యవస్థను అపహాస్యం చేసే విధంగా రాష్ట్రంలో ఎన్నడూ లేని రీతిలో ఎన్నికలు జరిగాయని సీపీఐ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రాయదుర్గంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నాగార్జున మాట్లాడుతూ, రాష్ట్రంలో అధికార కూటమి పార్టీ నాయకులు ప్రతిపక్ష, వామపక్ష, ప్రజాసంఘాల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడానికి వెళ్లిన సందర్భాల్లో నామినేషన్ పత్రాలను చించడం, అభ్యర్థులను అడ్డుకోవడం, భౌతిక దాడులకు పాల్పడటం వంటి ఘటనలకు తెగబడ్డారని ఆరోపించారు. మహిళా అభ్యర్థులని కూడా చూడకుండా దాడులకు పాల్పడటం, ఎన్నికల్లో పోటీ చేయకుండా అడ్డుకునేందుకు ప్రయత్నించడం, కొన్ని ప్రాంతాల్లో అభ్యర్థులను కిడ్నాప్ చేసిన ఘటనలు చోటుచేసుకోవడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టని విమర్శించారు. స్థానిక ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసేందుకు డబ్బులు, మద్యం, చీరలు పంపిణీ చేయడంతో పాటు చికెన్, మటన్, గుడ్లు వంటి వాటిని పంచుతూ



ఎన్నికలు ముగిసే వరకు అనేక రకాల ప్రలోభాలకు గురిచేశారని అన్నారు. ఇలాంటి అక్రమాలను అరికట్టడంలో ఎన్నికల కమిషన్, పోలీసు యంత్రాంగం పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కంబదూరు, కుందుర్పి మండలాల్లో ఎన్నికల కౌంటింగ్ రోజున ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు చెందిన బౌన్సర్లు వైసీపీ అభ్యర్థులను, ఏజెంట్లను కౌంటింగ్ కేంద్రాల్లోనే బెదిరించి దాడులకు పాల్పడినట్లు నాగార్జున ఆరోపించారు. కౌంటింగ్ కేంద్రాల్లోనే ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఎన్నికల నిర్వహణలో భద్రతా వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. కూటమి ప్రభుత్వం తమ అభ్యర్థులను గెలిపించుకోవడానికి అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రతిపక్ష, వామపక్ష, ప్రజాసంఘాల అభ్యర్థులు, నాయకులను అనేక ఇబ్బందులకు గురిచేస్తూ దాడులు, బెదిరింపులకు పాల్పడిందని విమర్శించారు. రాష్ట్రంలో భయానక వాతావరణాన్ని సృష్టించి ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో కూడా ప్రతిపక్ష, వామపక్ష, ప్రజాసంఘాల అభ్యర్థులు ఇలాంటి సమస్యలను ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ తక్షణమే స్పందించి సర్పంచ్ ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిగేలా కఠినమైన నిబంధనలు అమలు చేయాలని, అభ్యర్థులకు తగిన భద్రత కల్పించాలని, ఎన్నికల అక్రమాలు, ప్రలోభాలు, దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నాగార్జున డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఏఐవైఎఫ్ అనంతపురం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కావలి కోట్రేష్, సీపీఐ నాయకులు తిప్పేస్వామి, దుర్గన్న, తేజ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురికి కటకటాలు!

గుంతకల్లు పోలీసుల తనిఖీల్లో బయటపడిన బైక్‌ల చోరీ వ్యవహారం

రూ.4.15 లక్షల విలువైన సొత్తు రికవరీ

నాలుగు బైక్‌లు, వ్యవసాయ పరికరాలు స్వాధీనం

గుంతకల్లు, నవంబర్ 11 (తెలుగు కలం): ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించడంతో పాటు దొంగతనాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించిన గుంతకల్లు పోలీసులు మరో కేసును ఛేదించారు. మోటార్ సైకిళ్లు, వ్యవసాయ పరికరాలను దొంగిలిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 4.15 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

రైల్వే స్టేషన్ సమీపంలో పోలీసుల తనిఖీలు..

గుంతకల్లు పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో పోలీసులు సాధారణ తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ముగ్గురు వ్యక్తులు



అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా మోటార్ సైకిళ్లు, వ్యవసాయ పరికరాల చోరీలకు సంబంధించిన విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుల వద్ద నుంచి నాలుగు మోటార్ సైకిళ్లు, వ్యవసాయ పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ముగ్గురు నిందితుల వివరాలు..

అరెస్టయిన వారిలో కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన షేక్ రియాజ్, బళ్లారి పట్టణంలోని రూపనగుడి రోడ్డు ప్రాంతానికి చెందిన నందీషా, కర్నూలు జిల్లా కోసిగి మండలం అగసనూరు గ్రామానికి చెందిన హరిజన రాముడు ఉన్నారు.

పోలీసుల సమన్వయంతో కేసు ఛేదన..

జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు డీఎస్పీ బి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ వి. శ్రీధర్ పర్యవేక్షణలో ఈ కేసును ఛేదించారు. ఈ వ్యవహారంలో ఎస్సైలు కె. సురేష్ బాబు, గౌస్ బాషా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. దొంగతనాలకు గురైన ఆస్తిని స్వాధీనం చేసుకుని నిందితులపై చట్టపరమైన చర్యలు చేపట్టారు.

ప్రజల నమ్మకమే నా బాధ్యత.. వారి రుణం తీర్చుకోవడమే నా లక్ష్యం!

కౌన్సిలర్‌గా గెలిచిన పది రోజులకే ప్రజాక్షేత్రంలోకి..

అభివృద్ధి పనులకు శ్రీకారం

నిత్యం ప్రజల మధ్యే ఉంటూ..

వార్డు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

12వ వార్డు కౌన్సిలర్ రాయల్ వెంకటేష్

గుంతకల్లు, నవంబర్ 11 (తెలుగు కలం): ఎన్నికల్లో ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తన ముందున్న ప్రధాన లక్ష్యమని, తనను కౌన్సిలర్‌గా గెలిపించి ప్రజాసేవ చేసే అవకాశం కల్పించిన వార్డు ప్రజల రుణం తీర్చుకోవాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నానని గుంతకల్లు పట్టణం 12వ వార్డు కౌన్సిలర్ రాయల్ వెంకటేష్ పేర్కొన్నారు. పదవి వచ్చిందని బాధ్యతలను మరచిపోకుండా, ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయడమే తన విధానమని తెలిపారు. కౌన్సిలర్‌గా ప్రజలు తీర్పు ఇచ్చిన పది రోజుల వ్యవధిలోనే వార్డు అభివృద్ధి, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత తనపై ఉందని, ప్రజలు తనకు అప్పగించిన ఈ బాధ్యతను సేవగా భావిస్తున్నానని అన్నారు. వార్డులో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఇందులో



భాగంగా అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణంలోని 12వ వార్డు పరిధిలో ఉన్న బ్యాంక్ కాలనీ, పరిసర ప్రాంతాల్లో నివాసాల మధ్య పెరిగిన ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలను జేసీబీ యంత్రం సహాయంతో తొలగించే పనులు చేపట్టారు. కాలనీల్లో ముళ్ల పొదలు పెరగడం వల్ల ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులను గుర్తించి వాటిని తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పరిశుభ్రమైన వాతావరణం కల్పించడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు లేకుండా వార్డును తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

ప్రజాసేవే నాకు ముఖ్యం..

ప్రజలు ఓటు వేసి గెలిపించిన తర్వాత వారి వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదనే భావన తనకు లేదని, ప్రజలతోనే ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉండాలనేదే తన అభిమతమని రాయల్



వెంకటేష్ తెలిపారు. ఎన్నికల సమయంలో తనకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ, వారి నమ్మకానికి తగినట్లుగా పనిచేస్తానని అన్నారు. వార్డులో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్యం వంటి సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండే కౌన్సిలర్‌గా గుర్తింపు తెచ్చుకోవడమే తన ఆకాంక్ష అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఉపేంద్ర, ముష్కిన్, విజయ్, నరేంద్ర, కంబగిరి రాము తదితరులు పాల్గొని పనులను పర్యవేక్షించారు. కౌన్సిలర్‌గా బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజులకే వార్డు సమస్యలపై దృష్టి సారించి పనులు చేపట్టడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకం

దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల సేవలు మరువలేనివి

విద్యారంగ అభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన కృషి చిరస్మరణీయం

వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు వై. నైరుతి రెడ్డి

గుంతకల్లు, నవంబర్ 11 (తెలుగు కలం): దేశ స్వాతంత్ర్యం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన మహనీయుల ఆశయాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా ఉపాధ్యక్షురాలు వై. నైరుతి రెడ్డి పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు దేశం కోసం చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని, వారి ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంతకల్లు పట్టణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ట్రావెల్స్ బంగ్లా సర్కిల్ వద్ద బుధవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వై. నైరుతి రెడ్డి ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలు ఎంతో గొప్పవని కొనియాడారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాగిన స్వాతంత్ర్య ఉద్యమంలో ధైర్యంగా పోరాడిన ఆయన, దేశ ఐక్యత కోసం నిరంతరం కృషి చేశారని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి విద్యారంగ అభివృద్ధికి విశేష కృషి చేశారని గుర్తుచేశారు. విద్య అనేది ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండాలనే ఆశయంతో ఆయన చేసిన కృషి భారతదేశ విద్యా చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందన్నారు. మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్ వంటి స్వాతంత్ర్య సమరయోధులు దేశం కోసం చేసిన పోరాటాలు, త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు. తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దేశ స్వేచ్ఛ కోసం



పోరాడిన మహనీయుల వల్లే నేడు మనం స్వేచ్ఛా వాతావరణంలో

జీవిస్తున్నామని పేర్కొన్నారు. అలాంటి మహనీయుల చరిత్రను పాఠ్యాంశాలకే పరిమితం చేయకుండా ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలను చదివి వారి దేశభక్తి, సేవా భావం, త్యాగనిరతిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని, ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని దేశాభివృద్ధికి తోడ్పడాలని ఆమె ఆకాంక్షించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకోవడం ఆయన విద్యారంగానికి చేసిన సేవలకు దక్కిన గౌరవమని వై. నైరుతి రెడ్డి పేర్కొన్నారు.

పార్టీ నాయకులు, కార్యకర్తల హాజరు..

ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంతకల్లు పట్టణ అధ్యక్షుడు ఎండిఆర్ ఖలీల్, వార్డు కౌన్సిలర్లు ఎం.ఎం. రేమన్, పవన్ కుమార్, రేష్మ బేగం, లీగల్ సెల్ నాయకుడు అడ్వకేట్ ఆరిఫ్, వార్డు ఇన్‌ఛార్జులు జెసిబి చాంద్ బాషా, స్టార్ మాబు, కరీం ఖాన్, మెహబూబ్ భాష, మహమ్మద్ హుస్సేన్, రామాంజనేయులు, మైనార్టీ నాయకులు గఫార్ ఖాన్, మౌలా, ఆర్‌డీజీ భాష, డిష్ కాజా, కాజా, రెహమాన్, రమేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

రైతులు స్వచ్ఛందంగా ప్రకృతి సేద్యం వైపు అడుగులు వేయాలి

రాష్ట్రస్థాయి ప్రతినిధుల పిలుపు



ఓర్వకల్లు (తెలుగు కలం) (నవంబర్ 11) : ప్రతినిధి : ప్రకృతి వ్యవసాయం రైతుల బాధ్యతగా మారాలని, దాని విస్తరణలో మహిళా సంఘాలు కీలక పాత్ర పోషించాలని రాష్ట్రస్థాయి సీనియర్ థీమాటిక్ లీడ్ చక్రాల చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. బుధవారం ఓర్వకల్లులోని పొదుపు మహిళా ఐక్య సంఘం భవనంలో పొదుపు లక్ష్మి ఐక్య సంఘం గౌరవ సలహాదారురాలు విజయభారతమ్మ అధ్యక్షతన ఒకరోజు బ్రెయిన్‌స్టార్మింగ్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సమావేశంలో కర్నూలు జిల్లా ఓర్వకల్లు, నంద్యాల జిల్లా పాణ్యం మండలాల ప్రజాప్రతినిధులు, రైతు, మహిళా సంఘాల నాయకులు మరియు సిబ్బంది పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు స్వచ్ఛందంగా ఆచరించడంతో పాటు తోటి రైతులకు అవగాహన కల్పించాలని, క్షేత్రస్థాయి సమస్యలకు స్థానికంగానే పరిష్కారాలు కనుగొంటూ ఉమ్మడి కార్యాచరణతో లక్ష్యాలను సాధించాలని వక్తలు సూచించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు పీడీ శ్రీధర్ రావు, డీపీఎంలు మాధురి, శ్రీనివాసులు, టీఎల్ సురేష్, నరేంద్ర, ప్రవీణ్, అదనపు డీపీఎంలు లక్ష్మయ్య, సలాం, ఏపీఎం వెంకటరామిరెడ్డి, ఐసీఆర్‌పీలు, వీఓఏలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి ప్రాంతంలో గంజాయి స్వాధీనం నిందితుడి అరెస్ట్



శ్రీకాళహస్తి (తెలుగు కలం) (నవంబర్ 11) : ప్రతినిధి : తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో గంజాయి అక్రమ విక్రయాల గుట్టు రట్టయ్యింది. శ్రీకాళహస్తి మండలం అక్కుర్తి రైల్వే గేటు వద్ద పోలీసులు దాడి చేసి ఒక నిందితుడిని అరెస్టు చేయడంతో పాటు అతని వద్ద నుంచి భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అక్కుర్తి రైల్వే గేటు సమీపంలో గంజాయి అక్రమ విక్రయాలు జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో, శ్రీకాళహస్తి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి. ఇబ్రహీం తన సిబ్బంది, రెవెన్యూ అధికారులతో కలిసి ఆ ప్రాంతానికి చేరుకుని ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో గంజాయి కలిగి ఉన్న ముచ్చువోలు గ్రామానికి చెందిన బర్రి మోహన్ రెడ్డి ని పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి సుమారు 1,100 గ్రాముల గంజాయి, ఒక సెల్‌ఫోన్, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక విచారణలో నిందితుడు ఒడిశా రాష్ట్రం ఛత్రపూర్ పట్టణానికి చెందిన శీను అనే వ్యక్తి వద్ద నుంచి గంజాయిని కొనుగోలు చేసి తీసుకువచ్చి, స్థానికంగా విక్రయిస్తున్నట్లు వెల్లడైందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై శ్రీకాళహస్తి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎన్డిపిఎస్ చట్టం సెక్షన్ 8(ఎ) తీ/ష 20(ఎ)(ఐఐ)(డీ) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. గంజాయి సరఫరా చేస్తున్న ప్రధాన సూత్రధారితో పాటు ఈ అక్రమ కార్యకలాపాల్లో భాగస్వాములైన ఇతర వ్యక్తులను త్వరలోనే గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. యువత గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి అక్రమ రవాణా లేదా విక్రయాలపై ఎక్కడైనా సమాచారం తెలిస్తే వెంటనే సమీపంలోని పోలీసులకు కానీ, 'దయల్ 112' కు కానీ తెలియజేయాలని తిరుపతి జిల్లా పోలీసులు సూచించారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

వేములపాడులో పల్లెనిద్ర కార్యక్రమం

గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలపై ప్రత్యేక దృష్టి : సీఐ శ్రీనివాసులు





యాడికి, (తెలుగు కలం) (నవంబర్ 11) : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయడమే పల్లెనిద్ర కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని సీఐ శ్రీనివాసులు తెలిపారు.బుధవారం రాత్రి యాడికి మండల పరిధిలోని వేములపాడు గ్రామంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడిన సీఐ.. గ్రామంలో నెలకొన్న సమస్యలు, శాంతిభద్రతల పరిస్థితులపై ఆరా తీశారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. నేరాల నియంత్రణలో ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.పోలీసుల కు,ప్రజలకు మధ్య సత్సంబంధాలు పెంపొందించి, ప్రజల్లో భద్రతా భావాన్ని కల్పించేందుకు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వ హిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిల్ కోఆప్షన్ సభ్యుడిగా తమ

సామాజిక వర్గానికి అవకాశం కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి



గుంతకల్లు (తెలుగు కలం) (నవంబర్ 11) : ప్రతినిధి : గుంతకల్లు మున్సిపల్ కౌన్సిల్‌లో తమ సామాజిక వర్గానికి సముచిత స్థానం కల్పించాలని కోరుతూ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు బుధవారం స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ?ఈ సందర్భంగా పట్టణంలో సుదీర్ఘకాలం పాటు ప్రజాసేవ చేసిన మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణకు మున్సిపల్ కౌన్సిల్ కోఆప్షన్ సభ్యుడిగా అవకాశం ఇవ్వాలని కోరుతూ సంఘం నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేశారు. పట్టణంలోని నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు మున్సిపల్ కౌన్సిల్ దృష్టికి వెళ్లాలంటే తమ వర్గం నుండి ఒక ప్రతినిధి కౌన్సిల్‌లో ఉండటం ఎంతో అవసరమని వారు వివరించారు. గతంలో కౌన్సిలర్‌గా పనిచేసిన అనుభవం ఉన్న లక్ష్మీనారాయణకు కోఆప్షన్ సభ్యుడిగా అవకాశం ఇస్తే, పట్టణ అభివృద్ధిలో భాగస్వామ్యం కావడంతో పాటు తమ వర్గ సంక్షేమానికి కృషి చేస్తారని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. రాజకీయంగా తమ సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యం కల్పించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకుల విజ్ఞప్తిని సావధానంగా విన్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఈ విషయంపై సానుకూలంగా స్పందించినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. అర్హులైన వారికి తగిన న్యాయం జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై వామపక్షాల నిరసన

గుంతకల్లులో కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకొని ఆందోళన

గుంతకల్లు (తెలుగు కలం) (నవంబర్ 11) : ప్రతినిధి : రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ తీరుకు నిరసనగా గుంతకల్లు పట్టణంలో వామపక్ష పార్టీల నాయకులు వినూత్న రీతిలో ఆందోళన చేపట్టారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట సీపీఐ, సీపీఎం నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకుని కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకొని తమ నిరసనను వ్యక్తం చేశారు. ?ఈ సందర్భంగా వామపక్ష నాయకుడు వీరభద్ర స్వామి మాట్లాడుతూ ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలు రాష్ట్రవ్యాప్తంగా ఏమాత్రం సజావుగా జరగలేదని తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన ఎన్నికల ప్రక్రియను అధికార యంత్రాంగం పూర్తిగా అపహాస్యం చేసిందని ఆయన విమర్శించారు. ఎన్నికల అధికారులు, పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలోనే అనేక చోట్ల దౌర్జన్యాలు, అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. యంత్రాంగం కళ్లు మూసుకుని వ్యవహరించిందనే సంకేతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే తాము కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్నట్లు నాయకులు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని, ఎన్నికల్లో జరిగిన అక్రమాలపై తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వామపక్ష నేతలు డిమాండ్ చేశారు.

కార్తిక మాసంలో స్ఫటిక లింగ దర్శనం ఆధ్యాత్మిక ప్రశాంతత

41 రోజుల పాటు శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామికి ప్రత్యేక అభిషేకాలు



యాడికి (తెలుగు కలం) (నవంబర్ 11) : యాడికి మండల కేంద్రంలోని హైస్కూల్ క్రీడా మైదానం సమీపం లో నాగులకట్ట వీధిలో వెలసిన శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో స్ఫటిక లింగ ప్రతిష్ఠ అనంతరం 41 రోజుల పాటు ప్రత్యేక అభిషేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శివారాధనలో స్ఫటిక లింగానికి విశిష్టమైన స్థానం ఉందని, స్వచ్ఛత, ప్రశాంతత, ఆధ్యాత్మిక చైతన్యానికి ఇది ప్రతీకగా నిలుస్తుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ముఖ్యంగా కార్తిక మాసంలో స్ఫటిక లింగాన్ని దర్శించి పూజించడం విశేష ఫలప్రదమని భక్తుల విశ్వాసమని పేర్కొన్నారు. స్వామివారి దర్శనంతో మనసుకు ప్రశాంతత, ఆధ్యాత్మిక తృప్తి కలుగుతా యని తెలిపారు. ప్రతిరోజూ తెల్లవారుజామున 5 గంటలకు శివనామస్మరణ మధ్య స్వామివారికి నిత్యపూజలు,అభిషేకాలు నిర్వహిస్తు న్నారు. వివిధ రకాల పూలు, పండ్లతో జలాభిషేకం, పుష్పా భిషేకం, తేనాభిషేకం, పంచామృతాభిషేకం తదితర విశేష పూజలు జరుపుతున్నారు.41 రోజుల పాటు జరిగే ఈ ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని శివుని కృపాకటాక్షాలు పొందాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ప్రత్యేక అభిషేకాలు చేయించుకోవాలనుకునే భక్తులు ఆలయ కమిటీ సభ్యులను సంప్రదించాలని సూచించారు.

ధర్మవరంలో రైలు కింద పడి
గుర్తు తెలియని యువకుడి మృతి



ధర్మవరం (తెలుగు కలం) (నవంబర్ 11) : ప్రతినిధి : స్థానిక రైల్వే స్టేషన్ నాలుగో ప్లాట్‌ఫామ్‌పై మంగళవారం రాత్రి జరిగిన ఒక విషాద ఘటనలో సుమారు 28 ఏళ్ల గుర్తు తెలియని యువకుడు రైలు కింద పడి ప్రాణాలు కోల్పోయాడు. తిరుపతి నుంచి అమరావతికి వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు నాలుగో ప్లాట్‌ఫామ్‌పై నిలిచి ఉన్న సమయంలో, ఆ యువకుడు అకస్మాత్తుగా రైల్వే పట్టాలపై పడుకున్నాడు. కొద్దిసేపటికే రైలు ముందుకు కదలడంతో అతను రైలు చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి ఆచూకీ మరియు అతని వివరాలను తెలుసుకునేందుకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తాడిపత్రిలో వైసీపీ నేత కారుకు నిప్పు
గుర్తుతెలియని వ్యక్తుల దుశ్చర్య



తాడిపత్రి (తెలుగు కలం) (నవంబర్ 11) : ప్రతినిధి : అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణ పరిధిలోని నందలపాడులో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కలకలం రేగింది. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) నేత అలీకి చెందిన కారును గుర్తుతెలియని దుండగులు నిప్పంటించి దగ్ధం చేశారు. బాధితుడు అలీ ఎప్పటిలాగే మంగళవారం రాత్రి తన కారును ఇంటి ముందు పార్క్ చేసి నిద్రపోయారు. బుధవారం ఉదయం నిద్రలేచి బయటకు వచ్చి చూడగా, కారు పూర్తిగా కాలిపోయి బూడిదై ఉండటాన్ని గమనించి ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. అర్ధరాత్రి సమయంలో ఎవరో కావాలనే తన వాహనానికి నిప్పు పెట్టి ఉంటారని ఆయన అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ?ఈ ఘటనపై బాధితుడు అలీ వెంటనే తాడిపత్రి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన నిందితులను గుర్తించేందుకు పోలీసులు చుట్టుపక్కల ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ దర్యాప్తును ముమ్మరం చేశారు. రాజకీయ కక్షలతోనే ఈ దాడి జరిగిందా లేక మరేదైనా కారణం ఉందా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన ఇల్లు
రూ. 1.5 లక్షల నగదు, బంగారం బూడిద



కర్నూలు (తెలుగు కలం) (నవంబర్ 11) : ప్రతినిధి : కర్నూలు జిల్లాలో జరిగిన అగ్నిప్రమాదంలో ఓ నిరుపేద కుటుంబం సర్వస్వస్వం కోల్పోయింది. దేవనకొండ బీసీ కాలనీలో చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో పాటు, ఇంట్లో దాచుకున్న నగదు, బంగారం అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికులు మరియు బాధితులు తెలిపిన వివరాల ప్రకారం, దేవనకొండ బీసీ కాలనీకి చెందిన కుటుంబం ఉపాధి కోసం రోజువారీ కూలి పనులకు వెళ్ళింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యుత్ సరఫరాలో షార్ట్ సర్క్యూట్ సంభవించింది. క్షణాల వ్యవధిలో మంటలు ఇల్లు అంతటా వ్యాపించడంతో ఇంట్లోని వస్తువులు, గృహోపకరణాలు పూర్తిగా కాలిపోయాయి. ఇల్లంతా దట్టమైన పొగలు కమ్ముకోవడం గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి మరియు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా శ్రమించి మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. అయితే, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఇల్లు పూర్తిగా కాలి బూడిదైంది. ఈ ప్రమాదంలో కూలి పనుల ద్వారా కూడబెట్టుకున్న రూ. 1.5 లక్షల నగదుతో పాటు, ఒక తులం బంగారు ఆభరణాలు మంటల్లో పూర్తిగా కాలిపోయినట్లు బాధితురాలు కన్నీరుమున్నీరవుతూ వాపోయారు. నిరుపేద కుటుంబం ఒక్కసారిగా రోడ్డున పడటంతో స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సర్పంచ్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి కర్నూలు కలెక్టర్



కర్నూలు (తెలుగు కలం) (నవంబర్ 11) : ప్రతినిధి : కర్నూలు జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి అధికారులను స్పష్టంగా ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో, నిబంధనలకు లోబడి జరిగేలా అధికారులు పూర్తి సన్నద్ధతతో ఉండాలని సూచించారు. ఈ నేపథ్యంలో కర్నూలు జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పలు కీలక అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైన క్షణం నుంచి, పోలింగ్ రోజు జరిగే తంతు మరియు చివరిగా ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు ప్రతి దశలోనూ ఎన్నికల సంఘం నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని కలెక్టర్ తేల్చిచెప్పారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన వసతులు కల్పించాలని, అదేవిధంగా పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని ప్రాథమిక సౌకర్యాలు సమకూర్చేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజాస్వామ్య యుతంగా ఎన్నికలు సజావుగా సాగేందుకు అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

కుందుర్పి మండలంలో చిరుత సంచారం కలకలం

అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ హెచ్చరిక



కుందుర్పి (తెలుగు కలం) (నవంబర్ 11) : ప్రతినిధి : కుందుర్పి మండల పరిధిలోని బసాపురం, కొత్తూరు గ్రామాల చుట్టుపక్కల ప్రాంతాల్లో చిరుతపులి సంచరిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆయా గ్రామాల ప్రజలు, రైతులు మరియు గొర్రెల కాపరులు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారి మల్లికార్జున సూచించారు. ఈ వార్త నేపథ్యంలో బుధవారం అటవీశాఖ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల పరిసర ప్రాంతాల్లో గొర్రెల కాపరులకు ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ అధికారి మల్లికార్జున మాట్లాడుతూ పశువులను, గొర్రెలను మేతకు తీసుకెళ్లే సమయంలో రైతులు, కాపరులు తగిన జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా అటవీ ప్రాంతాలు, పొదలు ఎక్కువగా ఉన్న ప్రదేశాలు అలాగే జనసంచారం తక్కువగా ఉండే నిర్జన ప్రాంతాలకు ఎవరూ ఒంటరిగా వెళ్లకూడదని హెచ్చరించారు. గొర్రెల మందలను మేపేందుకు అడవి వైపునకు తీసుకెళ్లేటప్పుడు తప్పనిసరిగా గుంపులుగా వెళ్లాలని, సాయంత్రం వేళల్లో చీకటి పడకముందే పశువులతో సహా గ్రామాలకు సురక్షితంగా చేరుకోవాలని సూచించారు. ?రాత్రి సమయాల్లో పశువులను బహిరంగ ప్రదేశాల్లో కట్టేయకుండా సురక్షితమైన ప్రదేశాల్లో ఉంచుకోవాలని, గొర్రెల కొట్టాలకు తగిన రక్షణ ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన వివరించారు. ఒకవేళ ఎక్కడైనా చిరుతపులి ఎదురుపడితే దాని దగ్గరకు వెళ్లడం, వెంబడించడం, కేకలు వేస్తూ రెచ్చగొట్టడం వంటి ప్రమాదకర చర్యలకు పాల్పడకూడదని స్పష్టం చేశారు. చిరుత సంచారాన్ని గమనించిన వెంటనే ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ?గ్రామస్థులు ఎలాంటి అపోహలకు లోనుకావద్దని, వదంతులను నమ్మి ప్రచారం చేయకుండా అధికారుల సూచనలను తూచా తప్పకుండా పాటించాలని తెలిపారు. ఒకవేళ పశువులపై చిరుత దాడి జరిగినా, దానికి సంబంధించిన పాదముద్రలు లేదా ఇతర ఆనవాళ్లు ఏ ప్రాంతంలోనైనా కనిపిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు తెలియజేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ప్రాణాలను రక్షించడంతో పాటు వన్యప్రాణుల సంరక్షణ కూడా ఎంతో కీలకమని, చిరుతను సొంతంగా బంధించే ప్రయత్నాలు లేదా వాటికి హాని కలిగించే చర్యలకు పాల్పడకుండా అధికారులకు పూర్తిగా సహకరించాలని మల్లికార్జున విజ్ఞప్తి చేశారు. చిరుత సంచారం పట్ల గ్రామస్థులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు పాటిస్తే ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా ప్రమాదాలను నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు. బసాపురం, కొత్తూరు గ్రామాల్లో అటవీశాఖ అధికారులు నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమం స్థానిక రైతుల్లో మరియు గొర్రెల కాపరుల్లో ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది.

కర్నూలు జిల్లాలో విషాదం
హెచ్ఎన్ఎస్ఎస్ కాలువలో కాలుజారి పడి వ్యక్తి మృతి



పత్తికొండ (తెలుగు కలం) (నవంబర్ 11) : ప్రతినిధి : కర్నూలు జిల్లాలో ఒక విషాదకర సంఘటన చోటుచేసుకుంది. పత్తికొండ పట్టణానికి చెందిన సురేశ్ (43) అనే వ్యక్తి హెచ్ఎన్ఎస్ఎస్ కాలువలో కాలుజారి పడి దుర్మరణం చెందారు. దీపావళి పండుగ పూలను కాలువలో నిమజ్జనం చేయడానికి వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం జరగడంతో స్థానికంగా తీవ్ర విషాదం అలుముకుంది. సంఘటనకు సంబంధించి పూర్తి వివరాల ప్రకారం, పత్తికొండ పట్టణ నివాసి అయిన సురేశ్ దీపావళి పండుగ పూలను నది లేదా కాలువలో పారేయడం కోసం హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వద్దకు వెళ్లారు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు ఆయన కాలుజారి కాలువలో పడిపోయారు. ఇది గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై ఆయనను రక్షించడానికి తీవ్రంగా ప్రయత్నించారు. అయితే, నీటి ఉధృతి మరియు ఇతర కారణాల వల్ల వారు ఎంత ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. అప్పటికే ఆయన ప్రాణాలు కోల్పోయారు. ?మృతుడు సురేశ్‌కు భార్య, ఒక కుమారుడు మరియు ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న ఆయన ఇలా అకస్మాత్తుగా ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు గుండెలు పగిలేలా రోదిస్తున్నారు. వారి రోదనలు స్థానికులను సైతం కలచివేశాయి. ?సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నారు. పండుగ రోజున జరిగిన ఈ అనూహ్య ప్రమాదం పత్తికొండ ప్రాంతంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం
రాకూడదు జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి




నందికొట్కూరు (తెలుగు కలం) (నవంబర్ 11) : ప్రతినిధి : నందికొట్కూరు మండలం మల్యాలలోని హంద్రీ-నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) పంప్ హౌస్‌ను జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పంప్‌హౌస్, ఫోర్‌బే, మరియు లింక్ ఛానల్ ద్వారా నీటి సరఫరా జరుగుతున్న తీరును ఆమె పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముచ్చుమర్రి నుంచి మల్యాల ఫోర్‌బేకు 17 కిలోమీటర్ల లింక్ ఛానల్ ద్వారా నీరు చేరుతున్న విధానాన్ని, పంపింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం మూడు పంపుల ద్వారా 920 క్యూసెక్కుల నీటిని హంద్రీ-నీవా కాల్వలోకి విడుదల చేస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అలాగే, గత ఆగస్టు 5వ తేదీ నుంచి ఇప్పటివరకు నిరంతరాయంగా నీటి విడుదల కొనసాగుతూ వస్తోందని, మొత్తం 21 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు వారు వెల్లడించారు. పరిశీలన అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ.. తాగు, సాగునీటి అవసరాలరీత్యా నీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పంపుల నిర్వహణపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, రైతులకు ఇబ్బంది కలగకుండా సజావుగా నీరు అందేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎన్ఎస్-ఎస్ ఎస్ఈ రాజన్‌బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు క్రిష్టన్న, ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం కలెక్టర్ , ఎస్పీ ఆదేశాలు



కర్నూలు (తెలుగు కలం) (నవంబర్ 11) : ప్రతినిధి : కర్నూలు జిల్లాలో డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి మరియు ఎస్పీ విక్రాంత్ పాటిల్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మాదకద్రవ్యాల నివారణ మరియు నియంత్రణపై సచివాలయంలో ఏర్పాటు చేసిన సమగ్ర సమీక్షా సమావేశంలో వారు ఈ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మరియు ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, అలాగే వాటి వినియోగాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. యువత మరియు విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడి భవిష్యత్తును పాడుచేసుకోకుండా ఉండేందుకు, వారిలో డ్రగ్స్ దుష్ప్రభావాలపై విస్తృతస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులను, పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. కళాశాలలు, పాఠశాలల పరిసర ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. నగరంలో నేరాల నియంత్రణకు మరియు భద్రతను పటిష్టం చేయడానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. ఇందులో భాగంగా కర్నూలు నగరంలో ఇప్పటికే గుర్తించిన 30 డార్క్ స్పాట్లలో (చీకటి ప్రాంతాలు లేదా నేరాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాలు) తక్షణమే వీధి దీపాలు (స్ట్రీట్ లైట్స్) మరియు నిఘా కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సంబంధిత మున్సిపల్ అధికారులను స్పష్టం చేశారు. రాత్రి సమయాల్లో గస్తీని మరింత ముమ్మరం చేయాలని పోలీసు శాఖను ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

పులమతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ సెంటర్ ప్రారంభం



హిందూపురం (తెలుగు కలం) (నవంబర్ 11) : ప్రతినిధి : లేపాక్షి మండలం పులమతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఓపెన్ స్కూల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎగ్జామినేషన్ అధికారి లాజర్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చదువుకు దూరమైన వారికి మరియు మధ్యలో చదువు ఆపేసిన వారికి ఈ ఓపెన్ స్కూల్ విధానం ఎంతగానో ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్కరూ ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ?ప్రారంభ కార్యక్రమంలో భాగంగా ఆయన పాఠశాల తరగతి గదులను, రికార్డులను పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి, రాబోయే బోర్డు పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు అనుసరించాల్సిన వ్యూహాలు, తీసుకోవాల్సిన తగు జాగ్రత్తలపై విలువైన సలహాలు, సూచనలు అందించారు. ?ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం తదితరులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలను
ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి డీఆర్ఓ మోహన్ కుమార్



చిత్తూరు (తెలుగు కలం) (నవంబర్ 11) : ప్రతినిధి : భారతదేశ తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రి, గొప్ప విద్యావేత్త మరియు స్వాతంత్ర్య సమరయోధుడు డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం చిత్తూరు కలెక్టరేట్‌లోని వివేకానంద భవన్‌లో జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఆర్ఓ మోహన్ కుమార్... మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ గొప్ప పండితుడని, స్వాతంత్ర్య సమరంలో మహాత్మా గాంధీతో కలిసి కీలక పాత్ర పోషించారని కొనియాడారు. దేశ ప్రథమ విద్యాశాఖ మంత్రిగా విద్యారంగ అభివృద్ధికి ఆయన విశేష కృషి చేశారని, ఐఐటీ వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థల ఏర్పాటుకు గట్టి పునాదులు వేశారని గుర్తుచేశారు. మహిళా విద్యతో పాటు ప్రతి ఒక్కరికీ విద్య అందాలని, కేవలం విద్య ద్వారానే దేశాభివృద్ధి సాధ్యమని ఆయన బలంగా విశ్వసించారని డీఆర్ఓ తెలిపారు. ఆయన రచించిన 'ఇండియా విన్స్ ఫ్రీడమ్' వంటి గ్రంథాలు ఎంతో విలువైనవని పేర్కొంటూ, ఆయన మార్గాన్ని మరియు ఆశయాలను అందరూ ఆచరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారి లక్ష్మీనారాయణ, కలెక్టరేట్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం రాజకీయాల్లో తీవ్ర దుమారం

జేసీ ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలపై వైసీపీ అధికార ప్రతినిధి పద్మావతి కౌంటర్



అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 11) : ప్రతినిధి : అనంతపురం జిల్లా రాజకీయాల్లో మరోసారి మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పసలపూలేటి పద్మావతి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి వ్యవహారశైలిని, ఆయన చేస్తున్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి తన నోరు అదుపులో పెట్టుకోవాలని పసలపూలేటి పద్మావతి హితవు పలికారు. రాజకీయంగా విమర్శలు చేసేటప్పుడు హుందాగా వ్యవహరించాలని, ఇష్టానుసారంగా మాట్లాడితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ గురించి మాట్లాడే అర్హత, స్థాయి జేసీ ప్రభాకర్‌రెడ్డికి లేదని స్పష్టం చేశారు. సీనియర్ నాయకుల పట్ల అగౌరవంగా మాట్లాడటం ఆయన నైజాన్ని మారుస్తోందని ఎద్దేవా చేశారు. ?ఇదే సమయంలో యల్లనూరు, పుట్లూరు మండలాల రాజకీయాలపై జేసీ ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను పద్మావతి తీవ్రంగా తప్పుబట్టారు. ఆ మండలాలకు నీకు అసలు ఏం సంబంధం ఉందని ఆమె ప్రశ్నించారు. సంబంధం లేని విషయాలపై స్పందిస్తూ అనవసర ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు. తాము మాట్లాడటం ప్రారంభిస్తే జేసీ ప్రభాకర్‌రెడ్డి వాటిని తట్టుకోలేరని, సంయమనం పాటిస్తున్నామని గ్రహించాలని హెచ్చరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను, నాయకత్వాన్ని విమర్శించే నైతిక హక్కు టీడీపీ నేతలకు లేదని ఆమె తేల్చిచెప్పారు.

పరిగిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమీక్షా సమావేశం

వైసీపీ శ్రేణులకు మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ భరోసా







పరిగి (తెలుగు కలం) (నవంబర్ 11) : ప్రతినిధి : శ్రీ సత్యసాయి జిల్లా పరిగి మండల కేంద్రంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాజీ మంత్రివర్యులు, శ్రీ సత్యసాయి జిల్లా వైసీపీ అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీమతి ఉషశ్రీ చరణ్ ఆత్మీయ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు చేసిన కృషిని ఆమె అభినందించారు. పార్టీ కోసం నాయకులు, కార్యకర్తలు పడిన కష్టాన్ని ఎప్పటికీ మర్చిపోనని స్పష్టం చేశారు. అధికార పార్టీ అభ్యర్థులతో హోరాహోరీగా పోరాడి, అతి తక్కువ మెజార్టీతో ఓటమి చెందినా నాయకులు, కార్యకర్తల పోరాట స్ఫూర్తి మరువలేనిదని ఉషశ్రీ చరణ్ కొనియాడారు. ఎన్నికల్లో తక్కువ ఓట్ల తేడాతో ఓటమి చెందిన వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థులను ఈ కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ప్రజల కోసం మరియు పార్టీ కోసం కష్టపడిన ప్రతి నాయకుడికి, కార్యకర్తకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఆమె భరోసా కల్పించారు. కష్టకాలంలో పార్టీ శ్రేణులందరూ ఐక్యంగా ఉంటూ, ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించాలని ఉషశ్రీ చరణ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో ఘనంగా జాతీయ మాంస శాస్త్ర వర్క్‌షాప్ ప్రారంభం



తిరుపతి (తెలుగు కలం) (నవంబర్ 11) : ప్రతినిధి : తిరుపతి ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీలో మాంస ఉత్పత్తుల విలువ ఆధారిత, సుస్థిర సంస్కరణపై రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయ వర్క్‌షాప్ బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఎస్వీ వెటర్నరీ సాంకేతిక విభాగం, హైదరాబాద్‌లోని ఇండియన్ మీట్ సైన్స్ అసోసియేషన్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాయి. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్ వైకుంఠరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు అసోసియేట్ డీన్ డాక్టర్ పి. మాలకొండయ్య, రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్. వినూ, ఐసీఏఆర్ పూర్వ డైరెక్టర్ డాక్టర్ ఎన్. కొండయ్య, పూర్వ డీన్ డాక్టర్ ఎండీ నదీమ్ ఫైరోజ్, ఐఎంఎస్ఏ ప్రతినిధులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ డాక్టర్ వైకుంఠరావు మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం రెండు చారిత్రాత్మక ఘట్టాల కలయికగా నిలిచిందని తెలిపారు. తిరుపతి వెటర్నరీ సైన్స్ కళాశాల ప్లాటినమ్ జూబ్లీ వేడుకలు, ఇండియన్ మీట్ సైన్స్ అసోసియేషన్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు ఒకేసారి జరుపుకోవడం విశేషమన్నారు. దేశంలో మన మాంస ఉత్పత్తులు గణనీయంగా ఉన్నప్పటికీ, ప్రాసెసింగ్ రంగం ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ఉత్పత్తి అయ్యే మాంసంలో ఎక్కువ భాగం తాజా, ప్రాసెస్ చేయని రూపంలోనే అమ్ముడవుతోందని, నిల్వ ఉండే ఉత్పత్తులు పరిమితంగానే లభిస్తున్నాయని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ దృక్పథం కేవలం తరగతి గదులు, డిగ్రీలకే పరిమితం కాదని, 'ల్యాబ్-టు-ల్యాండ్', 'బెంచ్-టు-మార్కెట్' సాంకేతికతలను ప్రజలకు చేరవేయడమే తమ ముఖ్య లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద పశు సంపద కలిగిన దేశాల్లో ఒకటిగా ఉన్నప్పటికీ, పోస్ట్-హార్వెస్ట్ విలువ ఆధారిత ఉత్పత్తులు రెండు శాతం కంటే తక్కువగానే ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో మాంస ఉత్పత్తుల ప్రాసెసింగ్, సహజ నిల్వ పద్ధతులు, ఆహార భద్రత, ఆధునిక ప్యాకేజింగ్ మరియు వ్యర్థాల రహిత వినియోగంపై నిపుణులు శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్. వినూ మాట్లాడుతూ, పశుసంవర్ధక రంగంలో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ అనేది ఇకపై కేవలం ఆడంబరం కాదని, అది ఆర్థికంగా మరియు పోషకాహార పరంగా ఒక అత్యవసర అవసరంగా మారుతోందని అభిప్రాయపడ్డారు. వర్క్‌షాప్ కోఆర్డినేటర్, ఎల్‌పీటీ విభాగాధిపతి డాక్టర్ జి. విజయ భాస్కరరెడ్డి మాట్లాడుతూ, పరిశోధనా ఫలితాలను వాణిజ్య సరళిలోకి తీసుకెళ్లి గ్రామీణ మహిళలు, స్వయం సహాయక సంఘాలు, విద్యార్థులు, నూతన పారిశ్రామికవేత్తలకు ప్రాసెసింగ్ రంగంలో నైపుణ్యాలను అందించడమే ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశమని వెల్లడించారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన 60 మందికి పైగా ప్రతినిధులు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు, పరిశ్రమల ప్రముఖులు ఈ వర్క్‌షాప్‌లో సక్రమంగా పాల్గొంటున్నారు.

తిరుమలలో 21 'స్మార్ట్' బస్టాప్‌లు ఏర్పాటుకు ముందుకొచ్చిన రేమండ్ గ్రూప్

తిరుమలలో 'స్మార్ట్' బస్టాప్‌లను అభివృద్ధి చేసేందుకు రేమండ్ గ్రూప్ ముందుకు వచ్చింది. కొండపై 21 ప్రాంతాల్లో బస్టాప్‌లు నిర్మించేందుకు టీటీడీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.తిరుమల కొండపై ఉచిత 'ధర్మరథం' షటిల్ బస్సుల కోసం వేచి ఉండే భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తగ్గించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలక నిర్ణయం తీసుకుంది. ప్రముఖ కార్పొరేట్ సంస్థ 'రేమండ్ గ్రూప్', ఈ షటిల్ బస్సులు తిరిగే మార్గాల్లో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన 21 'స్మార్ట్' బస్సు స్టాపులను నిర్మించేందుకు ముందుకు వచ్చింది.

ప్రాజెక్టు ముఖ్యాంశాలు

నిర్మాణ ప్రణాళిక: టీటీడీ రవాణా విభాగం అధికారులు మొత్తం 21 ప్రాంతాల్లో ఈ స్టాపులను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఉన్న 5 షెల్టర్లను ఆధునీకరించడంతో పాటు, మరో 16 కొత్త బస్సు స్టాపులను నిర్మిస్తారు.మూడు దశల్లో పనులు: ఈ ప్రాజెక్టును మూడు దశల్లో పూర్తి చేయనున్నారు. మొదటి దశలో రద్దీ ఎక్కువగా ఉండే రాంభగీచ, లేపాక్షి జంక్షన్ సహా మరో కీలక ప్రాంతంలో మెరుగైన సౌకర్యాలతో కూడిన పెద్ద బస్టాప్‌లను నిర్మిస్తారు. మిగిలిన వాటిని తర్వాతి రెండు దశల్లో అందుబాటులోకి తెస్తారు.ఆధారిత డిజైన్: టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు ఇప్పటికే 'ఆధారిత' బస్టాప్ నమూనాను రేమండ్ గ్రూప్‌కు అందజేశారు. ప్రస్తుతం బహిరంగ ప్రదేశాల్లో వేచి ఉంటున్న భక్తులకు, ఈ కొత్త షెల్టర్ల ద్వారా ఎండ, వర్షాల నుంచి పూర్తి ఉపశమనం కలగనుంది.'వెంకటాద్రి' యాప్‌తో అనుసంధానం: ఈ స్మార్ట్ బస్టాప్‌లు సాంకేతికతకు అధిక ప్రాధాన్యతనిస్తాయి. ప్రతి స్టాప్ వద్ద ఒక ప్రత్యేకమైన 'స్మార్ట్' క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశారు. ఇది ఇప్పటికే ఉన్న 'వెంకటాద్రి' యాప్‌తో అనుసంధానించారు. భక్తులు తమ మొబైల్ ఫోన్‌లతో ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా, కింది సమాచారాన్ని సులభంగా పొందవచ్చు. ధర్మరథం బస్సుల పూర్తి రూట్ మ్యాప్.



3 దశల్లో పల్లె పోరు ఈనెల 13న నోటిఫికేషన్లు

రాష్ట్రంలో 13,171 పంచాయతీలకు మూడు దశల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఈనెల 13న రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్లు విడుదల చేయనుంది.ఏపీలో 13,171 పంచాయతీలకు మూడు దశల్లో పోలింగ్ నిర్వహణకు ఈ నెల 13న రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) నోటిఫికేషన్లు ఇవ్వనుంది. ఈ నెల 26, 29, డిసెంబర్ 2న మూడు దశల్లో వీటిని పోలింగ్ నిర్వహించనున్నారు. తొలి దశ ఎన్నికల వరకే 13న నోటిఫికేషన్ ఇవ్వాలని ఎన్నికల సంఘం తొలుత నిర్ణయం తీసుకుంది. మిగిలిన రెండు దశల పోలింగ్‌కు 16, 19 తేదీల్లో నోటిఫికేషన్లు జారీ చేయాలని భావించింది. అయితే తాజా నిర్ణయం ప్రకారం 13న మూడు దశల పంచాయతీల పోలింగ్‌కూ ఒకేసారి నోటిఫికేషన్లు జారీ చేయనున్నారు.మరోవైపు తొలి దశలో పంచాయతీలతో పాటు పెండింగ్‌లోని 23 పట్టణ స్థానిక సంస్థలకు పోలింగ్ నిర్వహించేందుకు ఎన్నికల సంఘం చేస్తున్న కసరత్తు కొలిక్కి వచ్చింది. మొదటి దశలో ఏయే పంచాయతీలకు పోలింగ్ నిర్వహించాలన్నది కలెక్టర్లు ఎస్ఈసీకి ప్రతిపాదనలు చేశారు. 23 పట్టణ స్థానిక సంస్థలతో కలిపి పోలింగ్ నిర్వహించనున్నందున, తొలి దశలో పంచాయతీల సంఖ్య సాధ్యమైనంత తక్కువ ఉంటే మేలని కలెక్టర్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మిగతా పంచాయతీలకూ మరో రెండు దశల్లో పోలింగ్ నిర్వహించేలా నిర్ణయం తీసుకోవాలని ఎన్నికల సంఘానికి సూచిస్తున్నారు.రేపు ఎస్ఈసీ వీడియో కాన్ఫరెన్స్ : మూడు దశల్లో పంచాయతీల్లో పోలింగ్ నిర్వహణకు సన్నద్ధతపై చర్చించేందుకు రేపు (గురువారం) కలెక్టర్లు, ఎస్పీలతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) పునేఠా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు.30 పంచాయతీలకు ఎన్నికలు లేనట్లే : మరోవైపు తిరుపతి జిల్లాలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు న్యాయపరమైన చిక్కులు ఎదురవుతున్నాయి. వివిధ గ్రామ పంచాయతీల విలీనం, విభజనలకు సంబంధించి న్యాయస్థానాల్లో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో 30 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించడం లేదు. ఈ మేరకు మంగళవారం నాడు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఈ జాబితాలో శ్రీకాళహస్తి, వడమాలపేట, కోడూరు, పుల్లంపేట, చంద్రగిరి, కేవీబీపురం, పాకాల, బాలాయపల్లి, దక్కిలి, రామ చంద్రాపురం తదితర మండలాల్లోని పంచాయతీ లున్నాయి.గతంలో గ్రామాల విలీనం, పంచాయతీల విభజన, కొత్త పంచాయతీల ఏర్పాటు తదితర అంశాలపై జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులను సవాల్ చేస్తూ పలువురు న్యాయస్థానాలను ఆశ్రయించారు. కొన్ని పంచాయతీల పరిధి మార్పులు, మరికొన్ని గ్రామాలను ఇతర పంచాయతీల్లో విలీనం చేయడంపై వివాదాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో మొత్తం 30 పంచాయతీల్లో 280 వార్డులు, 280 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది.



వెబ్‌ల్యాండ్‌లోకి చొరబడ్డారు 70 ఎకరాలు తారుమారు చేశారు

వెబ్‌ల్యాండ్ రికార్డుల ట్యాంపరింగ్ ముఠా గుట్టును సీఐడీ రట్టు చేసింది. ఈ మేరకు అక్రమాలకు పాల్పడ్డ నలుగురిని అరెస్ట్ చేసింది.వెబ్‌ల్యాండ్ రికార్డుల ట్యాంపరింగ్ చేస్తూ కోట్ల విలువైన భూములను ఇతరుల పేరిట మార్చేస్తున్న నలుగురు సభ్యుల ముఠా ఆగడాలకు సీఐడీ అడ్డుకట్ట వేసింది. వీరంతా దాదాపు రూ.50 లక్షలు వసూలు చేసి సుమారు 70 ఎకరాలకు సంబంధించిన 30 రికార్డులను మార్చేసినట్లు ప్రాథమికంగా గుర్తించింది. ఈ కుంభకోణం ద్వారా లబ్ధిపొందిన మిగతా వారిని గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగిస్తోంది. ప్రకాశం జిల్లా దొనకొండ మండలం ఇండ్లచెరువు, పడమరలక్ష్మీపురం గ్రామాల పరిధిలోని 6.65 ఎకరాలకు సంబంధించి వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో అసాధారణ స్థాయిలో అనధికారిక మార్పులు జరిగాయంటూ భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయం ఇచ్చిన ఫిర్యాదుపై సీఐడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసింది.పడమరలక్ష్మీపురానికి చెందిన ప్రధాన నిందితుడు వడ్లమూడి ఏడుకొండలు తన కుటుంబానికి చెందిన భూముల వెబ్‌ల్యాండ్ రికార్డులను తన తండ్రి వడ్లమూడి వెంకటేశ్వర్లు పేరిట మార్చాలని భావించారు. ఇందుకోసం తన సమీప బంధువు గుండపనేని వెంకటేశ్వర్లును సంప్రదించారు. ఆయన పురపాలక శాఖ కమిషనరేట్‌లో పొరుగు సేవల ప్రాతిపదికన డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేసే తన చిన్ననాటి స్నేహితుడు వేముల వెంకటరావు అలియాస్ వెంకట్‌ను పరిచయం చేశారు.వడ్లమూడి ఏడుకొండలుకు వెంకట్ ద్వారా అన్న క్యాంటీన్ ప్రాజెక్టులో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేసే షేక్ బాషా, ఆయన ద్వారా విజయవాడ నేషనల్ ఇన్‌ఫర్మేషన్ సెంటర్-(ఎన్ఐసీ) పొరుగు సేవల ప్రాతిపదికన జూనియర్ డెవలపర్‌గా పనిచేసే సాయికుమార్ పరిచయమయ్యారు. సాయికుమార్‌కు వెబ్‌ల్యాండ్ డేటాబేస్ యాక్సెస్ ఉంది. ఏడుకొండలు, వెంకటేశ్వర్లు ఇతరుల పేరిట ఉన్న భూముల వివరాలను గుర్తించి వెంకట్‌కు అందించేవారు. ఆ భూములను ఎవరి పేరిట మార్చాలో వివరించేవారు. ఆ సమాచారాన్ని వెంకట్, బాషాకు చేరవేసేవారు. ఆయన సాయికుమార్ ద్వారా వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో మార్పులు చేయించేవారు.ఎన్ఐసీలో సీనియర్ అధికారిగా పనిచేసే జీవీఎస్ఆర్ శర్మ లాగిన్ క్రెడెన్షియల్స్‌ను ఆయనకు తెలియకుండా సాయికుమార్ అక్రమంగా వినియోగించేవారు. నిర్ణీత దరఖాస్తు, పరిశీలన, రెవెన్యూ ఆమోదం వంటి ప్రక్రియలన్నింటినీ బైపాస్ చేసేసి వెబ్‌ల్యాండ్ డేటాబేస్‌లో మార్చేసేవారు. ప్రతిగా షేక్ బాషా భార్య అమీనా ఫోన్ నుంచి ఎప్పటికప్పుడు సాయికుమార్‌కు నగదు జమయ్యేది. ఈ ఏడాది ఆగస్టులో రూ.50,000లు, సెప్టెంబర్‌లో రూ.25,000లు చెల్లించినట్లు సీఐడీ తేల్చింది.వెబ్‌ల్యాండ్‌లో మార్పులు చేశాక తహసీల్దార్ కార్యాలయ రికార్డుల్లో ఎలాంటి మ్యుటేషన్ ప్రొసీడింగ్స్, మంజూరు ఉత్తర్వులు లేకుండానే ఆన్‌లైన్ రికార్డుల్లో కొత్త పట్టాదారుల పేర్లు ప్రత్యక్షమయ్యాయి. సాయికుమార్‌కు డబ్బులిస్తానని ఆశ చూపించడంతో పాటు అతని స్నేహితులకు ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి బాషా ఈ అక్రమాల ఊబిలోకి దించాడు.



రూ.కోట్ల విలువైన ఫాక్స్‌సాగర్ భూములు అన్యాక్రాంతం పునరుద్ధరణకు రంగంలోకి దిగిన హైడ్రా

జీడిమెట్లలో రూ.కోట్ల విలువైన ఫాక్స్‌సాగర్ చెరువు స్థలాలు ఆక్రమణకు గురయ్యాయి. ప్రస్తుతం ఈ చెరువు పునరుద్ధరణకు హైడ్రా రంగంలోకి దిగింది.వేలాది మంది ప్రజలకు తాగు నీటిని అందించే జీడిమెట్ల చెరువు (ఫాక్స్ సాగర్) మరో హుస్సేన్ సాగర్‌గా మారింది. భూ కబ్జా రాయుళ్లతో అవినీతి అధికారులు కలిసి చెరువు ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్) పరిధిలోనే నిర్మాణాలు చేపట్టారు. 2014 తర్వాత కూడా రూ.కోట్ల విలువ చేసే చెరువు స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయి. ప్రస్తుతం ఫాక్స్ చెరువును పునరుద్ధరించేందుకు హైడ్రా రంగంలోకి దిగింది. ఆక్రమణలను తొలగించడమే ప్రధాన సవాల్‌గా మారింది.

1897 నాటి చెరువు

మేడ్చల్-మల్కాజిగిరి పరిధిలోకి వచ్చే జీడిమెట్ల చెరువును 1897లో నాటి నిజాం పాలకులు నిర్మించారు. అప్పటి బ్రిటీష్ అధికారి కొలినల్ ఆర్.ఈ.ఫాక్స్ దీనిని ఆధునికీకరించిన తర్వాత దీనికి ఫాక్స్ సాగర్ అనే పేరు ఏర్పడింది. ఈ చెరువు దూలపల్లి, జీడిమెట్ల, కొంపల్లి గ్రామాల మధ్య విస్తరించి ఉంది. ఈ మూడు గ్రామాలకు చెందిన సుమారు 453 ఎకరాలు పట్టా భూములు ముంపులో ఉన్నాయి. వర్షాకాలం తర్వాత ముంపు తగ్గితే రైతులు పంటలు పండించేవారు. కాలక్రమంలో చెరువు బఫర్ జోన్ మొత్తం రియల్ ఎస్టేట్‌గా మారింది. అధికారికంగా 52.34 ఎకరాలు ఉండగా, వంద ఎకరాలకు పైగా వెంచర్లు, పలు గోదాములు వెలిశాయి.

రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అండగా

చెరువు భూములను కాపాడాల్సిన ప్రభుత్వ అధికారులే రియల్ ఎస్టేట్‌కు తమ పూర్తి సహకారం అందించారు. 2014 తర్వాత చెరువు నీటి మట్టాన్ని 38 అడుగుల నుంచి 20 అడుగులకు తగ్గించారు. దీంతో ముంపు ప్రాంతం తగ్గి ఆ ప్రాంతాల్లో పలు వెంచర్లు వేశారు. 2020లో భారీ వరదను దిగువకు విడుదల చేసేందుకు ఏకంగా గేట్లనే ధ్వంసం చేశారు. నీరు లేకపోవడంతో పట్టా పేరుతో ఇబ్బడి ముబ్బడిగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. వాస్తవానికి ఈ ప్రాంతం (ఎఫ్‌టీఎల్) 22ఏలో చేర్చాల్సి ఉన్నప్పటికీ ఆ పని జరగలేదు. కానీ ఎడాపెడా రిజిస్ట్రేషన్లు మాత్రం జరిగాయి.



చెరువు మధ్యలో కట్ట నిర్మాణం

2018లో చెరువు ఆధునికీకరణ పనుల పేరుతో రూ.44 కోట్లు మంజూరు చేశారు. కొంతమంది ప్రయోజనాల కోసం గత ప్రభుత్వంలో నీటి పారుదల శాఖ అధికారులే చెరువు మధ్యలో కట్టను నిర్మించారు. సరిహద్దులు ముందుకు జరిపి సిమెంట్ రోడ్డు వేశారు. ఈ ప్రాంతంలోనే మాజీ మంత్రి 37 ఎకరాలు ఆక్రమించారని హైడ్రా గుర్తించింది. ఇటీవల సిమెంట్ రోడ్డును ధ్వంసం చేసింది. మరో న్యాయవాదికి చెందిన ఫామ్ హౌస్‌ను హైడ్రా తొలగించింది. సరిహద్దులు చెరిపేసిన అధికారులపై మాత్రం ఇప్పటికీ ఎలాంటి చర్యలు లేకపోవడం గమనార్హం.

వాటిపై సంయుక్త సర్వే

2014కు ముందు ఉన్న నిర్మాణాల జోలికి వెళ్లబోమని హైడ్రా చెబుతోంది. 2014-2023 మధ్య కాలంలో చాలా నిర్మాణాలు వచ్చాయి. గోదాములు ఎక్కువగా నిర్మాణం చేశారు. ఇటీవల జరిపిన సర్వేలో దాదాపు 150 ఎకరాలకు పైగా ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించారు. ప్రస్తుతం ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్) పరిధిలో జాయింట్ సర్వే చేయాలని నిర్ణయించి హైడ్రా ముందుకు కదిలింది. దీనిలో రెవెన్యూ అధికారుల ప్రమేయం లేకుండా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

చెరువు విస్తీర్ణం వివరాలు ఇలా

విస్తీర్ణం : 519 ఎకరాలు బఫర్ జోన్ : 52.34 ఎకరాలు ఎఫ్‌టీఎల్ పరిధి : 482.24 ఎకరాలు ఎఫ్‌టీఎల్ పరిధిలో ప్రభుత్వ భూమి : 16.30 ఎకరాలు ఎఫ్‌టీఎల్ పరిధిలో పట్టా : 453 ఎకరాలుచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఆక్రమణలు : దాదాపు 150 ఎకరాలకు పైగా! రూ.189 కోట్లతో ఫాక్స్‌సాగర్ ఆధునికీకరణ పనులు జీడిమెట్లలోని ఫాక్స్‌సాగర్ చెరువును హైడ్రా రూ.189 కోట్లతో ఆధునికీకరించనున్నట్లుగా ప్రకటించింది. ఇందుకోసం ముందుగా సర్వే చేసి సరిహద్దులు నిర్ణయించనుంది. దూలపల్లిలో పెద్దల ఆక్రమణలను తొలగిస్తారా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గుట్టుగా సంయుక్త సర్వే (జాయింట్ సర్వే) చేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. 2014లో హెచ్ఎండీఏ, నీటి పారుదల శాఖ సంయుక్తంగా సర్వే చేసి 482.24 ఎకరాలుగా ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్) నిర్ణయించింది. ప్రస్తుతం ఆ మేరకు రక్షించాలని హైడ్రాను స్థానికులు కోరుతున్నారు.

ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు పెంచిన గౌరవ వేతనం చెల్లించాలి

ఎస్ఈసీకి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి



అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 11) : ప్రతినిధి : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగులకు పెంచిన వేతనాలు చెల్లించడంతో పాటు, భోజన మరియు రవాణా సౌకర్యాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేఆర్ సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ పూనేటను ఉద్యోగ సంఘం నాయకులు కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేఆర్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు జీవో నెంబర్ 1345 మరియు జీవో నెంబర్ 1086 ప్రకారం ప్రభుత్వం పెంచిన గౌరవ వేతనాలు, ఇతర సదుపాయాలు సక్రమంగా అందడం లేదంటూ ఉద్యోగుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని ఎస్ఈసికి వివరించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, ఉద్యోగులందరికీ ఒకేసారి ప్రభుత్వం నిర్దేశించిన గౌరవ వేతనాలను జమ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పంచాయతీరాజ్ శాఖలో పీడీవోలు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్ల కోసం ఖర్చు చేసిన మొత్తాన్ని తిరిగి చెల్లించాలని కోరారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఖర్చు లెక్కలను పరిశీలిస్తూ, అడ్వాన్స్‌గా ఖర్చుపెట్టిన మొత్తాన్ని పంచాయతీ అధికారులకు తిరిగి చెల్లించని అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల విధుల్లో ఉద్యోగులు తీవ్ర శారీరక, మానసిక ఒత్తిడికి గురవుతున్న నేపథ్యంలో వారి ఆరోగ్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. విధుల నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులు మరియు ఖర్చుల చెల్లింపులపై అందిన ఫిర్యాదులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ సంఘం నాయకుల విజ్ఞణపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సానుకూలంగా స్పందించారు. ఈనెల 12న జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ అంశాలపై చర్చించి, సమస్యల పరిష్కారానికి తగిన ఆదేశాలు జారీ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు నాగినేని శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జిల్లా నాయకులు శ్రీనివాసరావు, జోజి బాబు, సుజాత, ఎం. రాణి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జిల్లాలో యువకుడు హత్య కేసు ఛేదన.. ఇద్దరు నిందితుల అరెస్ట్



కృష్ణ (తెలుగు కలం) (నవంబర్ 11) : ప్రతినిధి : కృష్ణా జిల్లా కంకిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని పునాదిపాడు ఫ్లైఓవర్ అండర్‌పాస్ సమీపంలో జరిగిన సంచలన యువకుడి హత్య కేసును పోలీసులు విజయవంతంగా ఛేదించారు. ఈ కేసులో బీహార్ రాష్ట్రానికి చెందిన రాకేష్ కుమార్ (28), మనీష్ కుమార్ (25)లను నవంబర్ 10వ తేదీన అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ కడలి జయకృష్ణ వెల్లడించారు. బుధవారం కంకిపాడు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ కేసుకు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. శ్రీ రాజ్యలక్ష్మి డైరీ ఫామ్‌లో పనిచేస్తున్న అనిల్ కుమార్ యాదవ్ (26) నవంబర్ 9వ తేదీ తెల్లవారుజామున నిద్రిస్తున్న సమయంలో, ఇద్దరు నిందితులు కోడికత్తులతో తీవ్రంగా దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన అనిల్ కుమార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అదే రోజు ఉదయం 8.45 గంటలకు మృతి చెందాడు. హత్యకు అసలు కారణం ఇదే.. గతంలో ఇదే డైరీ ఫామ్‌లో పనిచేసిన రాకేష్ కుమార్, విధుల పట్ల చూపిన నిర్లక్ష్యం కారణంగా తన ఉద్యోగాన్ని కోల్పోయాడు. అతని స్థానంలో బాధితుడు అనిల్ కుమార్‌ను యజమాన్యం నియమించింది. దీనివల్ల అనిల్ కుమార్‌పై తీవ్ర కక్ష పెంచుకున్న రాకేష్, తన స్నేహితుడు మనీష్ కుమార్‌తో కలిసి ముందస్తుగా ఈ హత్యకు పథకం రచించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. చలివేంద్రపాలెం పరిధిలోని జాతీయ రహదారిపై డైరీ 9 ఐస్‌క్రీమ్ కంపెనీ సమీపంలో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి నేరానికి ఉపయోగించిన రెండు కోడికత్తులు, ఒక హోండా యాక్టివా వాహనం, రెండు సెల్‌ఫోన్లు, నాలుగు జతల దుస్తులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ప్రమేయం ఉన్నట్లు భావిస్తున్న మూడో నిందితుడు అనీష్ కుమార్ కోసం పోలీసులు ప్రస్తుతం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో కంకిపాడు సీఐ బి.వి. రవికుమార్, ఎస్ఐ దాసు తదితరులు పాల్గొన్నారు.

వరుస ఘటనలతో తెలంగాణ ప్రభుత్వం సీరియస్..

విద్యాసంస్థల్లో సినిమా ప్రమోషన్ల బంద్!

రాష్ట్రంలోని విద్యా సంస్థల్లో సినిమా ప్రమోషన్లు, ఇతర ప్రైవేట్ కార్యక్ర మాలపై నిషేధం విధించే ందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇటీవల కొన్ని కళాశాలల్లో జరిగిన ప్రమాదాల్లో విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడంతో ప్రభుత్వం ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తోంది. విద్యార్థుల భద్రతను గాలికొదిలి, యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో కఠినమైన మార్గదర్శకాలు తీసుకురావాలని నిర్ణయించింది.ఇటీవల హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో సరైన భద్రతా ఏర్పాట్లు లేకుండా నిర్వహించిన దాండియా కార్యక్రమంలో ఒక విద్యార్థిని మరణించగా, పలువురు గాయపడ్డారు. మరో ప్రైవేట్ వర్సిటీలో జరిగిన సినిమా ప్రమోషన్ ఈవెంట్‌లోనూ అపశ్రుతి చోటుచేసుకుంది. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు, విద్యా ప్రాంగణాల్లో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలనే దానిపై స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని ప్రభుత్వం విద్యాశాఖను ఆదేశించింది.ఈ కొత్త నిబంధనల ప్రకారం.. క్యాంపస్‌లను కేవలం విద్య, క్రీడలకు సంబంధించిన కార్యక్రమాలకు మాత్రమే ఉపయోగించాలి. సినిమా ప్రమోషన్లు, ఇతర వాణిజ్య కార్యక్రమాలను పూర్తిగా నిషేధించనున్నారు. ఒకవేళ పెద్ద ఎత్తున క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాల్సి వస్తే, హాజరయ్యే వారి సంఖ్య, భద్రతా ఏర్పాట్ల గురించి ముందుగానే పోలీసు, అగ్నిమాపక శాఖలకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నిబంధనలను ఉల్లంఘించే విద్యాసంస్థల యాజమాన్యాలపై భారీ జరిమానాలతో పాటు కఠిన చర్యలు తీసుకోనున్నారు.కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థుల భద్రతను విస్మరించి, వా

భారీగా తగ్గిన సన్న వడ్ల ధరలు.. బియ్యం ధరలు మాత్రం తగ్గడం లేదు..!



రాష్ట్రంలో సన్న బియ్యం ధరలు భారీగా పెరిగాయి. మంచి రకం సన్న బియ్యం కిలో రూ.80 నుంచి రూ.90 పలుకుతున్నాయి. అయితే తాజాగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బియ్యం ధరలకు గరిష్ట పరిమితులు విధించింది. బియ్యం కిలో గరిష్ట ధర రూ.66గా నిర్ణయించగా.. , తెలంగాణ సోనా బియ్యం కిలో రూ.74, బియ్యం కిలో గరిష్ట ధర రూ.79గా నిర్ణయించింది. కిలో రూ.79 అయినా ఎక్కువగానే ధరలు ఉన్నాయి. బియ్యం ధరలు భారీగా ఉన్న నేపథ్యంలో సన్న వడ్లకు డిమాండ్ వస్తుందని అందరు రైతులు ఆనంద పడ్డారు. మొదట్లో సన్న వడ్లకు మంచి ధరే వచ్చింది. కానీ ఆ తర్వాత వ్యాపారులు సిండికేట్ అయి ధరలు భారీగా తగ్గించారు. మొన్నటి వరకు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు పలికిన సన్నవడ్లు ఇప్పుడు కొన్నిచోట్ల రూ.2,500కే అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వడ్ల రేట్లు పెరిగాయనే సాకుతో సన్నబియ్యాన్ని కిలో రూ.98 దాకా తీసుకెళ్లిన వ్యాపారులు, ఇప్పుడు వడ్ల రేట్లు తగ్గినా బియ్యం ధరలు మాత్రం తగ్గించడం లేదని చెబుతున్నారు. వ్యాపారులు, మిల్లర్ల సిండికేట్ ఉచ్చులో పడి అటు రైతులు, ఇటు వినియోగదారులు నష్టపోతున్నారు. సీజన్ ప్రారంభంలో సన్నవడ్లకు క్వింటాల్‌కు రూ.4 వేల నుంచి రూ.5 వేల దాకా రేటు పెట్టడంతో రైతులు ఆనంద పడ్డారు. కానీ వారి ఆనందం ఎంతో కాలం నిలవలేదు. రైతులకు గుడ్ న్యూస్.. త్వరలో రైతు భరోసా..! మిల్లర్లు, వ్యాపారులు హార్వెస్టర్ యజమానుల ద్వారా ముందే సమాచారం సేకరించి, గ్రామాల్లో ఏజెంట్లను పెట్టి, అడ్వాన్సులు ఇచ్చి మరీ పొలాల దగ్గరే పచ్చి ధాన్యం కొనుగోలు చేశారు. అదే సమయంలో ఎల్‌నినోతో ఈసారి వరి దిగుబడి తగ్గుతుందని, సన్నబియ్యం కొరత వస్తుందని భయాందోళనలు రేకెత్తించి, ఉన్న బియ్యాన్ని బ్లాక్ చేసి కిలో రూ.90 నుంచి రూ.98 వరకు పెంచారు. అనుకున్నట్లు బియ్యం రేట్లు పెంచుకున్నాక, ఇప్పుడు సిండికేట్‌గా మారి వడ్ల రేట్లు తగ్గిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. పలు జిల్లాల్లో సన్నవడ్లను క్వింటాల్‌కు రూ.2,900 నుంచి రూ.3,200కే కొనుగోలు చేస్తున్నారు. ఐకేపీ సెంటర్లో సన్న బియ్యం అమ్మితే రూ.2400 వరకు మాత్రమే వస్తాయి. ఆ తర్వాత రూ.500 బోనస్ ప్రభుత్వం ఇస్తుంది. బోనస్ వస్తుందో రాదో అనే భయంతో రైతులు సన్న వడ్లను రూ.2900 అమ్ముకుంటున్నారు. బియ్యానికి ముడిసరుకైన వడ్ల రేట్లు తగ్గుతున్నా, సన్నబియ్యం మాత్రం రకాన్ని బట్టి కిలో రూ.90 నుంచి రూ.98కే విక్రయిస్తున్నారు. బియ్యం రేట్లు పెంచి పాత స్టాక్‌పైనా అడ్డగోలు లాభాలు గడించిన వ్యాపారులు, మిల్లర్లు ఇప్పుడు రైతుల నుంచి కొనే వడ్ల రేట్లను తగ్గించడం అన్యాయమని వాపోతున్నారు. బియ్యం రేట్లు పెరగడానికి, వడ్ల రేట్లు తగ్గడానికి సిండికేటే కారణమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

స్టార్ హెల్త్ లో వాటా కొనుగోలుకు హెచ్‌డిఎఫ్‌సి మ్యూచువల్ ఫండ్‌కు ఐఆర్డీఏఐ గ్రీన్ సిగ్నల్

హెచ్‌డిఎఫ్‌సి మ్యూచువల్ ఫండ్ స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ కంపెనీలో వాటా కొనుగోలు చేసే ప్రతిపాదనకు ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపిందని స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రకటించింది. ఇందుకు సంబంధించి ఎక్సేంజ్‌లకు సమాచారం ఇచ్చింది. స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ కంపెనీ లో హెచ్‌డిఎఫ్‌సి మ్యూచువల్ ఫండ్ ఇప్పటికే కలిగి ఉన్న 4.49% వాటాను కలిగి ఉంది. ఇప్పుడు దాని చెల్లింపు వాటా మూలధనంలో 9.99% వరకు కొనుగోలు చేయనుంది. ఈ ఆమోదంతో, హెచ్‌డిఎఫ్‌సి మ్యూచువల్ ఫండ్ పథకాలు తమ ఉమ్మడి వాటాను ప్రస్తుత స్థాయి నుంచి 5.50 శాతం పెరుగుతుంది. నవంబర్ 9 నాటి ఒక రెగ్యులేటరీ ఫైలింగ్‌లో అదే రోజు జారీ చేసిన ఒక లేఖ ద్వారా బీమా నియంత్రణ సంస్థ తన ఆమోదాన్ని మంజూరు చేసిందని స్టార్ హెల్త్ తెలిపింది. కంపెనీ చెల్లింపు మూలధనంలో 9.99% (ప్రస్తుత పెట్టుబడి అయిన 4.49%తో సహా) వరకు కంపెనీ ఈక్విటీ షేర్లను హెచ్‌డిఎఫ్‌సి మ్యూచువల్ ఫండ్ పథకాలు కొనుగోలు చేయడానికి ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా 09 నవంబర్ 2026 నాటి లేఖ ద్వారా ఆమోదం తెలిపిందని స్టార్ హెల్త్ ప్రకటించింది. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా వారి లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్క్లోజర్ రిక్వైర్మెంట్స్ రెగ్యులేషన్స్, 2015లోని రెగ్యులేషన్ 30 ప్రకారం బీమా సంస్థ ఈ వివరాలను వెల్లడించింది. బంగారం ధరలు తగ్గాయని సంబర పడకండి.. ముందుంది ముసళ్ళ పండుగ అంటున్న కామర్జ్‌బ్యాంక్.. సెప్టెంబర్ 30, 2026తో ముగిసిన త్రైమాసికానికి స్టార్ హెల్త్ వాటాదారులను చూస్తే ఎణఖీజ మ్యూచువల్ ఫండ్ దాదాపు 2.64 కోట్ల షేర్లను కలిగి ఉంది. ఇది కంపెనీ ఈక్విటీ మూలధనంలో 4.49 శాతానికి సమానం. సెప్టెంబర్ చివరి నాటికి మ్యూచువల్ ఫండ్‌లు అన్ని కలిపి ఈ బీమా సంస్థలో 10.43% వాటాను కలిగి ఉన్నాయి. స్టార్ హెల్త్ ప్రమోటర్లు కంపెనీలో దాదాపు 58 శాతం వాటాను కలిగి ఉన్నారు. సేఫ్‌క్రాప్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఇండియా ూూూ 40.17% వాటాతో అతిపెద్ద వాటాదారుగా ఉండగా, దాని తర్వాత సితారా పార్టనర్స్ ూూూ 13.29% వాటాతో ఉంది. ఇతర సంస్థాగత పెట్టుబడిదారులలో, ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ 4.32% వాటాను కలిగి ఉండగా, బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్ 3.31% వాటాను కలిగి ఉంది. స్వతంత్ర ఆరోగ్య బీమా సంస్థ ఈ త్రైమాసికంలో పన్ను తర్వాత రూ. 265 కోట్ల లాభాన్ని నివేదించింది. గత ఏడాది ఇదే కాలంలో ఇది దాదాపు రూ. 80 కోట్లుగా ఉండగా, ఇప్పుడు 233% పెరుగుదలను నమోదు చేసింది. దీని సాధారణీకరించిన పన్ను అనంతర లాభం గతేడాదితో పోలిస్తే 70 శాతం పెరిగి రూ. 390 కోట్లకు చేరింది. కంపెనీ అండర్‌రైటింగ్ లాభం గత ఏడాది రూ. 40 కోట్ల నష్టం నుంచి రూ. 99 కోట్లకు మెరుగుపడింది. అండర్‌రైటింగ్ లాభదాయకతలో ఇది వరుసగా ఐదవ త్రైమాసికం మెరుగుదలను సూచిస్తుంది. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చి తత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొను గోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

సర్ఫ్ ఎక్సెల్, రీన్, వీల్ ధరలు భారీగా పెంపు..!



ప్రముఖ ఎఫ్ఎంసీజీ సంస్థ హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ వినియోగదారులకు షాక్ ఇచ్చింది. తమ కంపెనీకి చెందిన పలు డిటర్జెంట్ వస్తువులపై ధరలను పెంచింది. వ్యయాల ఒత్తిడిని అధిగమించడానికి, లాభాల మార్జిన్‌లను కాపాడుకోవడానికి తన ఉత్పత్తుల ధరలను పెంచింది. ఇందులో భాగంగా సర్ఫ్ ఎక్సెల్, రీన్, వీల్ వంటి ఉత్పత్తుల ధరలను 11 శాతం వరకు పెంచింది. ప్యాక్ పరిమాణాన్ని బట్టి ఈ ధరల పెంపు ఉంటుందని కంపెనీ ప్రకటించింది. కంపెనీ ఒక్కో ఉత్పత్తిపై రూ. 1 నుంచి రూ. 10 వరకు ధరలను పెంచింది. వీటితో పాటు మోతీ గులాబ్ సబ్బు ధరను కూడా కంపెనీ పెంచింది. ప్యాక్ పరిమాణాన్ని బట్టి ధరల్లో మార్పులు ఉన్నాయి. సర్ఫ్ ఎక్సెల్ క్విక్ వాష్ 1 కేజీ ప్యాక్ ధరను రూ. 235 నుండి రూ. 245కి పెంచింది. అలాగే 500 గ్రాముల ప్యాక్ ధరను రూ. 123 నుంచి రూ. 128కి పెంచింది. అదేవిధంగా సర్ఫ్ ఎక్సెల్ ఈజీ వాష్ 1 కేజీ ప్యాక్ ధరను రూ. 5 పెంచి రూ. 172కి చేర్చింది. 500 గ్రాముల ప్యాక్ ధరను రూ. 85 నుంచి రూ. 87కి పెంచింది. సర్ఫ్ ఎక్సెల్ డిటర్జెంట్ కేక్ ధరను రూ. 3 పెంచి రూ. 45కి చేర్చింది. 200 గ్రాముల సబ్బులు కలిగిన నాలుగు ప్యాక్‌ల సెట్ ధరను రూ. 10 పెంచి రూ. 155కి పెంచింది. షాకిచ్చిన అమూల్, నందిని.. నెయ్యి, వెన్న ధరలు భారీగా పెంపు..! వీటితో పాటు రీన్, వీల్ డిటర్జెంట్ల ధరలను కూడా హిందుస్థాన్ యూనిలీవర్ పెంచింది. రీన్ అలా 500 మి.లీ ప్యాక్ ధరను రూ. 90 నుంచి రూ. 95కి చేర్చింది. ఈ ధరల పెంపుతో రీన్ డిటర్జెంట్ పౌడర్ 1 కేజీ ప్యాక్ ధర ఇప్పుడు రూ. 123కి చేరింది. 500 గ్రాముల ప్యాక్ కోసం వినియోగదారులు రూ. 61 చెల్లించాల్సి ఉంటుంది. వీల్ డిటర్జెంట్ పౌడర్ 1 కేజీ ప్యాక్ ధరను రూ. 3 పెంచడంతో అది రూ. 90 నుంచి రూ. 93కి పెరిగింది. అదేవిధంగా దీని 500 గ్రాముల ప్యాక్ ధరను రూ. 46 నుంచి రూ. 47కి చేర్చారు. ఇవి దేశవ్యాప్తంగా సామాన్య ప్రజల్లో ఎంతో ప్రాచుర్యం పొందిన ఉత్పత్తులుగా ఉన్నాయి. ఈ ప్రముఖ ఎఫ్ఎంసీజీ సంస్థ మోతీ గులాబ్సబ్బు ధరను కూడా పెంచింది. ఈ సబ్బు (150 గ్రాముల ప్యాక్) ధరను రూ. 74 నుంచి రూ. 82కి పెంచింది. అంటే ఇది 10 శాతానికి పైగా పెరిగింది. ముడి పదార్థాలు, ఇతర ఉత్పాదక వ్యయాలు పెరుగుతుండటంతో, వాటి భారాన్ని తట్టుకోవడం ఎఫ్ఎంసీజీ కంపెనీలకు కష్టతరంగా మారిన నేపథ్యంలో ఈ ధరల పెంపును చేపట్టారు. ఉత్పాదక వ్యయాల్లో వచ్చే మార్పులకు అనుగుణంగా కంపెనీ క్రమ పద్ధతిలో ధరలను పెంచుకుంటూ వెళ్తుందని హెచ్ యుఎల్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ ప్రియా నాయర్ గతంలో చెప్పారు. డిస్క్లెమర్: ఈ వెబ్ సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రా యాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వ డం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూ రిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సై ట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందిం చబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముం దు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసు కోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

లోన్లు తీసుకున్న వారికి షాక్.. భారీగా వడ్డీ రేట్లు పెంచిన ఆ బ్యాంకు..!

ఆర్బీఐ రెపో రేటు పెంచడంతో పలు ఎన్బీఎఫ్సీలు, బ్యాంకులు ఫిక్స్ డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను పెంచాయి. కానీ.. ఇంతవరకు లోన్లపై వడ్డీ రేట్లను పెంచలేదు. ఇప్పుడు రుణాల వడ్డీ రేట్లపై బ్యాంకులు దృష్టి సారించాయి. తాజాగా ప్రభుత్వ దిగ్గజ బ్యాంక్ బ్యాంక్ ఆఫ్ బరోడా రుణగ్రహీతలకు షాక్ ఇచ్చింది. లోన్ వడ్డీ రేట్లను భారీగా పెంచేసింది. వివిధ రుణ కాలపరిమితులపై మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్లను ఏకంగా 20 బేసిస్ పాయింట్లు పెంచుతున్నట్లు బ్యాంక్ అధికారికంగా ప్రకటించింది. తాజా లోన్ రేట్ల పెంపుతో బ్యాంకు నుంచి రుణాలు తీసుకున్న సామాన్యులకు, మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక భారం మరింత పెరగనున్నాయి. ఈ కొత్త వడ్డీ రేట్లు నవంబర్ 12, 2026 నుంచి అమల్లోకి వస్తాయని బ్యాంక్ ప్రకటించింది. ఒక నెల కాలపరిమితి ఉన్న ఎంసీఎల్ఆర్ 7.95 శాతం నుంచి 8.00 శాతానికి పెంచింది. అలాగే 3 నెలల రేటు 8.30 శాతం నుంచి 8.50 శాతానికి చేర్చింది. 6 నెలల కాలపరిమితి కలిగిన రుణాలు 8.50 శాతం నుంచి 8.70 శాతానికి పెంచింది. ఇక రిటైల్ లోన్లకు అత్యంత కీలకమైన ఒక ఏడాది ఎంసీఎల్ఆర్ రేటును 8.75 శాతం నుంచి 8.85 శాతంగా మార్చింది. అయితే ఓవర్‌నైట్ ఎంసీఎల్ఆర్ మాత్రం ఎలాంటి మార్పు లేకుండా యథావిధిగా 7.85 శాతాన్నే కొనసాగించింది. ఈ వడ్డీ రేట్ల పెంపు నేరుగా హోమ్ లోన్స్, పర్సనల్ లోన్స్ ప్రభావం చూపనుంది. రూ.10, రూ.20, రూ.50 నోట్లు ఇక దొరకవా.. చిన్న నోట్ల కొరతపై కీలక అప్‌డేట్.. ఎంసీఎల్ఆర్ ఆధారిత లోన్లు తీసుకున్న కస్టమర్లకు.. వారి రీసెట్ తేదీలు వచ్చినప్పుడు వడ్డీ భారంతో పాటు నెలవారీ పెరిగే అవకాశం ఉంటుంది.. లేదంటే లోన్ చెల్లించే కాలాన్ని బ్యాంకులు పొడిగించే అవకాశం ఉంది. అయితే ఆర్‌బీఐ రెపో రేటు వంటి ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్‌లకు అనుసంధానించబడిన లోన్ తీసుకున్న వినియోగదారులపై మాత్రం ఈ ఎంసీఎల్ఆర్ పెంపు ప్రభావం ఉండదని బ్యాంక్ స్పష్టం చేసింది. తాజాగా వడ్డీ రేట్లను పెంచడానికి అసలు కారణాలను మాత్రం బ్యాంక్ పేర్కొనలేదు. ఈ నేపథ్యంలో బ్యాంక్ ఆఫ్ బరోడా కస్టమర్లు వెంటనే తమ లోన్ అగ్రిమెంట్లను, రీసెట్ తేదీలను పరిశీలించుకోవాల్సి అవసరం ఉంది. మిగతా బ్యాంకులు కూడా లోన్లపై వడ్డీ రేట్లను పెంచే అవకాశం ఉంది. అయితే ఆర్బీఐ మరోసారి రెపో రేటు పెంచే అవకాశం ఉన్న నేపథ్యంలో బ్యాంకులు వేచి చూస్తున్నాయి. మరోసారి ఆర్బీఐ రెపో రేటు పెంచితే బ్యాంకులు రుణాలపై వడ్డీలు పెంచే అవకాశం ఉంది. మరో పక్క కొన్ని బ్యాంకులు ఇప్పటి వరకు ఫిక్స్ డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను పెంచలేదు. ఆర్బీఐ నిర్ణయం తర్వాత ఆ బ్యాంకులు ఫిక్స్ డ్ డిపాజిట్లపై



వడ్డీ రేట్లను పెంచే అవకాశం ఉంది. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

ప్రయాణికులకు గుడ్ న్యూస్ చెప్పిన ఆర్టీసీ.. పుణ్యక్షేత్రాలకు ఇంటి నుంచి ప్రత్యేక బస్సులు..!



పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తులకు తెలంగాణ ఆర్టీసీ శుభవార్త చెప్పింది. పలు డిపోల నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ప్రకటించింది. ముఖ్యంగా హైదరాబాద్ వివిధ డిపోల నుంచి బస్సులు నడపనుంది. ప్రయాణికులు ఎక్కువగా ఉంటే ఇంటి వద్దకే బస్సులు రానున్నాయి. అందుకే వివిధ కాలనీలు, టౌన్‌షిప్‌లు, గేటెడ్ కమ్యూనిటీల నుంచే ప్రముఖ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక ఆధ్యాత్మిక యాత్ర బస్సులను నడపనున్నట్లు వెల్లడించింది. ఈ ప్రత్యేక బస్సులు 2026 నవంబర్ 10 నుంచి డిసెంబర్ 8 వరకు అందుబాటులో ఉంటాయని ప్రకటించింది. కార్తీక మాసం ఉన్న నేపథ్యంలో ఆర్టీసీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఒక్కో బస్సులో దాదాపు 40 మంది ప్రయాణించేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొంది. కుటుంబ సభ్యులు, స్నేహితులు, భక్తుల బృందాలు కలిసి యాత్రకు వెళ్లేందుకు ఈ సౌకర్యం ఉపయోగించుకోవచ్చు. సాధారణంగా పుణ్యక్షేత్రాలకు వెళ్లాలంటే ముందుగా బస్టాండ్‌కు చేరుకోవాలి. అక్కడి నుంచి మరో బస్సు లేదా ఇతర రవాణా సదుపాయాలను ఉపయోగించుకోవాల్సి ఉంటుంది. దీంతో కొంత మంది ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లలు ఉన్నవారు ఇబ్బంది పడాల్సి వస్తుంది. విద్యార్థులకు గుడ్ న్యూస్.. తెలంగాణలో స్కూళ్లకు ప్రతి శనివారం సెలవు.. 5 రోజుల తరగతుల విధానంపై ప్రతిపాదన.. అందుకే ఎక్కువ మంది ఉంటే ఇంటి దగ్గరికే బస్సులు పంపించనున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కాలనీలు, టౌన్‌షిప్‌లు, గేటెడ్ కమ్యూనిటీల నుంచి భక్తుల బృందాలకు అనుగుణంగా బస్సులను నడిపేలా ప్లాన్ చేస్తున్నారు. డిమాండ్ పెరిగితే బస్సుల సంఖ్య పెంచుతామని ఆర్టీసీ తెలిపింది. భక్తులు ఒకే యాత్రలో పలు ఆలయాలను సందర్శించేలా ఆర్టీసీ ప్రత్యేక సర్క్యూట్లను రూపొందించింది. కరీంనగర్ సర్క్యూట్ లో వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం, కొమురవెల్లి మల్లన్న ఆలయం, కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం, ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయాలను సందర్శించవచ్చు. వరంగల్ సర్క్యూట్ లో కాళేశ్వరం, వేయిస్తంభాల గుడి, రామప్ప ఆలయం, ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయం, లక్నవరం వంటి ప్రాంతాలను సందర్శించే అవకాశం ఉంటుంది. శ్రీశైలం సర్క్యూట్ శ్రీశైలం మల్లికార్జునస్వామి ఆలయంతో పాటు ఉమామహేశ్వరం, సోమశిల, కందూరు, జోగులాంబ గద్వాల క్షేత్రాలను సందర్శించవచ్చు. ఏపీలోని ప్రముఖ ఆలయాలను దర్శించుకోవాలనుకునే భక్తుల కోసం కూడా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. అన్నవరం, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట, అమరావతి ప్రాంతాలను కలుపుతూ యాత్రా ప్యాకేజీలు అందుబాటులోకి తీసుకొచ్చింది. తమిళనాడులోని ప్రసిద్ధ అరుణాచలం (తిరువణ్ణామలై) క్షేత్రానికి, కర్ణాటకలోని హంపి, మురుడేశ్వర్ పుణ్యక్షేత్రాలకు కూడా ప్రత్యేక బస్సులు నడపనున్నారు. హైదరాబాద్‌కు సమీపంలోని కీసరగుట్ట, అనంతగిరి హిల్స్, ముచ్చింతల, యాదాద్రి, సోమశిల వంటి ప్రాంతాలకు వెళ్లేందుకు కూడా ప్రత్యేక ప్యాకేజీలు రూపొందించారు.డా కరీంనగర్ నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. కరీంనగర్ నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు కరీంనగర్ ఆర్టీసీ అధికారులు తెలిపారు. ప్రత్యేక ఆధ్యాత్మిక యాత్ర బస్సుల బుకింగ్, ప్యాకేజీల ధరలు, ప్రయాణ వివరాలు తెలుసుకోవాలనుకునే భక్తులు తమ ప్రాంతానికి సంబంధించిన ఒ+ూ=ఇ డివిజన్ అధికారులకు ఫోన్ చేయవచ్చు. లేదా నేరుగా డిపోలకు వెళ్లవచ్చు. గుడ్ న్యూస్.. రాష్ట్రంలో 4.5 లక్షల మందికి కొత్త పింఛన్లు.. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

8వ వేతన సంఘంపై బిగ్ అప్‌డేట్.. జీతాల పెంపు, అమలు తేదీపై తాజా వివరాలు ఇవిగో..



కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు తమ జీతాలు, పెన్షన్లు, వివిధ అలవెన్సుల సవ రణల కోసం 8వ వేతన సంఘం సిఫార్సుల వైపు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే ఈ కమిషన్ నివేదిక ఎప్పుడు వెలువడుతుందిూ.. సవరించిన వేతనాలు వాస్తవ ంగా ఉద్యోగుల చేతికి ఎప్పుడు అందుతాయి అనే అంశాలపై మాత్రం ఉత్కంఠ నెలకొంది. 8వ వేతన సంఘం అక్టోబర్ 2025లో ఏర్పాటైంది. తన అధ్యయనాన్ని, పనిని పూర్తి చేయడానికి కమిషన్‌కు 18 నెలల కాలపరిమితిని కేటాయించారు. ఈ నిబంధన ప్రకారం మే 2027 వరకు నివేదిక సమర్పించడానికి గడువు ఉంది. ఇప్పటికే పలు ఉద్యోగ, పెన్షనర్ల సంఘాలతో కమిషన్ ప్రాథమిక చర్చలు పూర్తి చేసింది. ప్రక్రియ అనుకున్న సమయానికి పూర్తయితే 2027 ఫిబ్రవరి లేదా మార్చి నాటికి, లేదంటే తుది గడువైన మే 2027 నాటికి నివేదికను ప్రభుత్వానికి సమర్పించే అవకాశం ఉంది. కమిషన్ నివేదిక ఇచ్చిన వెంటనే సిఫార్సులు అమలులోకి రావు. ప్రభుత్వం మొదట ఈ సిఫార్సుల వల్ల పడే ఆర్థిక, పరిపాలనాపరమైన భారాన్ని అంచనా వేస్తుంది. దీనికై ఒక మంత్రుల బృందం లేదా ప్రత్యేక కమిటీ సిఫార్సులను సమగ్రంగా సమీక్షిస్తుంది. ఈ సమీక్ష పూర్తయి, ప్రభుత్వం అధికారిక ఆమోదం తెలపి ఉత్తర్వులు జారీ చేసే వరకు వేతన సవరణలు అమలులోకి రావు. ఈ సమీక్షా ప్రక్రియకు కనీసం మూడు నుండి ఆరు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. 8వ పే కమిషన్.. రైల్వే ఉద్యోగుల జీతం రూ. 18 వేల నుంచి 69 వేలకు.. కీలక ప్రతిపాదనలు ఇవే.. 8వ వేతన సంఘం సిఫార్సులు జనవరి 1, 2026 నుండి అమలులోకి వస్తాయని విస్తృతంగా భావిస్తున్నారు. ఒకవేళ ప్రభుత్వం 2027 చివరలో ఈ సిఫార్సులను ఆమోదించినప్పటికీ, పెంపుదల మాత్రం జనవరి 1, 2026 నుంచే అమలు చేస్తారు. ఆ తేదీ నుండి వాస్తవంగా జీతం పెరిగే రోజు వరకు ఉన్న మధ్య కాలాన్ని బకాయిల (అరియర్స్) రూపంలో ఉద్యోగులు, పెన్షనర్లకు చెల్లిస్తారు. గతంలో 7వ వేతన సంఘం (ఫిబ్రవరి 2014లో ఏర్పాటు, నవంబర్ 2015లో నివేదిక), 6వ వేతన సంఘం (అక్టోబర్ 2006లో ఏర్పాటు, మార్చి 2008లో నివేదిక) ప్రక్రియలను పరిశీలిస్తే, కమిషన్ ఏర్పాటు నుండి ఉద్యోగులకు చేతికి నగదు అందే వరకు సుదీర్ఘ సమయం పట్టింది. అదే తీరులో 8వ వేతన సంఘం నివేదిక 2027 నాటికి అందితే.. సమీక్షల అనంతరం 2027 ద్వితీయార్ధంలో ఉద్యోగులకు పెరిగిన జీతాలతో పాటు 2026 జనవరి 1 నాటి నుండి రావలసిన బకాయిలు కూడా లభించే అవకాశాలు ఉన్నాయి. 8వ వేతన సంఘం – తరచుగా అడిగే ప



‘ఈ నగరానికి ఏమైంది’ సీక్వెల్ ట్రైలర్ అప్‌డేట్..

వచ్చేస్తోన్న మ్యాడ్ గ్యాంగ్!

టాలీవుడ్ యువతను ఊపేసిన కల్ట్ హిట్ సినిమా ‘ఈ నగరానికి ఏమైందికి సీక్వెల్‌గా వస్తున్న చిత్రం ‘ఈఎన్‌ఈ రీపీట్’ టాలెంటెడ్ డైరెక్టర్ తరుణ్ భాస్కర్ తెరకెక్కించిన ఈ చిత్రంపై చప్పటికే భారీ అంచనాలు నెలకొనగా.. తాజాగా ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ ఒక క్రేజీ అప్‌డేట్‌ను ప్రకటించి సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చారు. ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్‌ను నవంబర్ 13 తేదీ సాయంత్రం 5:00 గంటలకు విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రంలో విశ్వక్ సేన్, అభినవ్ గోమటం, శ్రీకాంత్ మగంటి, వెంకటేష్ కాకుమాను తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సురేష్ ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కుతున్న ఈ సినిమాకు వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్నారు. కాగా, ఈ పూర్తి స్థాయి ఎంటర్‌టైనర్ సినిమా నవంబర్ 19, 2026 న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ట్రైలర్‌తో సినిమాపై మరింత హైప్ క్రియేట్ చేయడానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది.

మ్యూజిక్ డైరెక్టర్‌పై క్లారిటీ.. అనిరుధ్, జీవీ ప్రకాష్‌లకు నో ఛాన్స్, బాలయ్య సినిమా అప్‌డేట్ ఇదే!



నందమూరి నటసింహం బాలకృష్ణ, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ చిత్రం వీరిది 112పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. బాలయ్య మాస్ ఇమేజ్‌కు కొరటాల శివ మార్క్ కథనం తోడైతే థియేటర్లలో అభిమానులకు పండగే అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో పూజా కార్యక్రమాలతో ఈ సినిమాను ఘనంగా ప్రారంభించారు. ఎస్ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన సంగీత దర్శకుడి ఎంపికపై ఆసక్తికర చర్చ సాగుతోంది. వీరీధీ 112కు సంగీతం అందించబోయే దర్శకుడు ఎవరనే విషయంపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో రకరకాల వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. తాజాగా తమిళ స్టార్ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ ఈ ప్రాజెక్ట్‌కు పనిచేయబోతున్నారని ప్రచారం జరిగింది. అయితే అయన సరసన సినిమాలతో బిజీగా ఉండటంతో ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నట్లు కథనాలు వెలువడ్డాయి. ఆ తర్వాత అనిరుధ్ స్థానంలో మరో ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్‌ను తీసుకున్నారంటూ వార్తలు వచ్చాయి. దీంతో బాలయ్య సినిమాకు జీవీ ప్రకాష్ సంగీతం అందించబోతున్నారని అభిమానులు భావించారు. ఈ వార్తలు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం కావడంతో మ్యూజిక్ డైరెక్టర్ ఎంపికపై ఆసక్తి మరింత పెరిగింది. సంగీత దర్శకుడి ఎంపికపై వస్తున్న వరుస ప్రచారాలకు చిత్ర బృందం తాజాగా స్పందించింది. అనిరుధ్ రవిచందర్, జీవీ ప్రకాష్ కుమార్‌లలో ఎవరినీ ఇప్పటివరకు అధికారికంగా ఖరారు చేయలేదని స్పష్టం చేసింది. ప్రస్తుతం పలువురు సంగీత దర్శకులతో చర్చలు జరుగుతున్నప్పటికీ తుది నిర్ణయం తీసుకోలేదని అంటున్నారు.



పా. రంజిత్ ‘వేట్టువం’ రిలీజ్ డేట్ ఫిక్స్.. సంక్రాంతి 2027 బరిలో భారీ యాక్షన్ ఎపిక్!

సరికొత్త కథాంశాలతో సినిమాలను తెరకెక్కిస్తూ కోలీవుడ్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ దర్శకుడు పా. రంజిత్ తెరకెక్కిస్తున్న మోస్ట్ అంటిసిపేటెడ్ ప్రాజెక్ట్ ‘వేట్టువం’ విడుదలకు సంబంధించిన అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చేసింది. ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు మేకర్స్ ముహూర్తం ఫిక్స్ చేశారు. ప్రతిష్టాత్మకమైన సంక్రాంతి 2027 కానుకగా వచ్చే ఏడాది జనవరిలో ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఈ సినిమాకు సంబంధించిన గ్లింప్స్ అండ్ టీజర్ ఇప్పటికే సోషల్ మీడియాలో భారీ హైప్‌ను క్రియేట్ చేశాయి. ఇది ఒక ఇంటెన్స్ పోస్ట్-అపోకలిప్టిక్ థ్రిల్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కుతోంది. పా.రంజిత్ కల్ట్ బ్లాక్ మూవీ ‘మ్యాడ్ మాక్స్: ఫ్యూరీ రోడ్’ తరహా థ్రిల్స్ మరియు ఎలిమెంట్స్‌తో ఈ సినిమా ఉండబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. భూమి విధ్వంసం, కార్పొరేట్ కుండిలేట్ల మరియు ప్రాచీన సంస్థానికి మధ్య జరిగే పోరాట నేపథ్యంలో ఈ కథ సాగనుంది. ఈ చిత్రంలో టాలెంటెడ్ హీరో ఆర్య హీరోగా నటిస్తుండగా, శోభిత ధూళిపాళ వి.ఆర్. దినేష్ రవి కీలక పాత్రలు పోషిస్తున్నారు. వీరితో పాటు కలైయరసన్, గురు సోమసుందరం, జాన్ విజయ్, పాటీర్ తదితరులు ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. నీలం ప్రొడక్షన్స్ మరియు లెర్న్ అండ్ టీచ్ ప్రొడక్షన్ సంస్థలు సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ప్రముఖ సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి అదిరిపోయే మ్యూజిక్ అందిస్తున్నారు.

రామ్ చరణ్ - సుకుమార్ సినిమా ప్రారంభోత్సవానికి వేళాయె.. ఆసక్తికర పోస్ట్ పెట్టిన దర్శకుడి భార్య!



మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్, క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కలయికలో తెరకెక్కుతున్న భారీ చిత్రం కోసం మెగా అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ‘రంగస్థలం’ వంటి సంచలన విజయం తర్వాత ఈ ఇద్దరూ మరోసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన విషయం బయటకు వచ్చింది. రేపు ఈ చిత్రం ఘనంగా ప్రారంభం కానుండగా, అంతకంటే ముందే సుకుమార్ భార్య తబితా సుకుమార్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచింది.తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో తబితా సుకుమార్ ఈ సినిమా గురించి భావోద్వేగపూరితంగా స్పందించారు. సుకుమార్ భార్యగా ఈ ప్రాజెక్ట్ తనకు ఎంతో గర్వంగా, ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ సినిమా రచన కోసం సుకుమార్ ఎంత కష్టపడ్డారో, ఎన్ని గంటలు శ్రమించారో తనకు తెలుసని తెలిపారు. అయన పెట్టిన కష్టం, అంకితభావం ఇప్పుడు తెరపైకి రాబోతుండటం ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తోందని ఆమె వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ కోసం సుకుమార్ ఎంతో సమయం కేటాయించి కథపై పనిచేశారని తబితా తన పోస్ట్‌లో వివరించారు. అయన రచనలో చూపించిన శ్రమ, పట్టుదల తనకు తెలుసని చెబుతూ.. ఈ కష్టం ఒక రూపం దాల్చడం చూడటం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. అంతేకాదు, ఎంతో అభిమానాన్ని సంపాదించుకున్న రామ్ చరణ్ -- సుకుమార్ కలయిక రెండోసారి ప్రేక్షకుల ముందుకు వస్తుండటంతో అంచనాలు మరింత పెరిగాయని తెలిపారు. తబితా పెట్టిన ఈ పోస్ట్ మెగా అభిమానులను ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా సుకుమార్ కథ కోసం ఇంతగా కష్టపడ్డారనే విషయం అభిమానుల్లో సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ గురించి రకరకాల వార్తలు ప్రచారంలో ఉండగా, తాజాగా దర్శకుడి భార్య చేసిన వ్యాఖ్యలు కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి. ఈ సినిమా ప్రారంభోత్సవం రేపు ఘనంగా జరగనుంది. ఈ వేడుకతో ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు బయటకు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా సినిమా ఏ తరహా కథతో తెరకెక్కనుంది? ఇందులో రామ్ చరణ్ పాత్ర ఎలా ఉండబోతోంది? అనే ప్రశ్నలకు కొంత స్పష్టత రావచ్చని అభిమానులు ఆశిస్తున్నారు. ‘రంగస్థలం’లో రామ్ చరణ్‌ను పూర్తిగా భిన్నమైన పాత్రలో చూపించి సుకుమార్ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఇప్పుడు మరోసారి వీరిద్దరూ జతకట్టడంతో ఈసారి ఎలాంటి కథను ఎంచుకున్నారనే ఆసక్తి నెలకొంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలు రేపటి వేడుకలో వెల్లడయ్యే అవకాశముంది.

M/S ACHUKATLA PUBLICATIONS D.NO. 9/1542, M.R. ROAD, GOOTY RS, ANANTHAPUR, ANDHRA PRADESH - 515402.